# జనవాహిని





దెవిల్ ఫస్ట్‌లుక్ విడుదల

8లో


ప్రచురణ, తెలంగాణ, | సంపుటి -08 | సంచిక -61 | మంగళవారం 12 -12-2023 | పేజీలు -4. | వెల రూ.2/-





# 370 ఆర్టికల్ రద్దు సమర్ధనీయమే

- రద్దు నిర్ణయం రాజ్యాంగబద్దమే • ఆర్టికల్ రద్దుకు రాష్ట్ర అనుమతి అవసరం లేదు
- జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక సార్వభౌమాధికారం లేదు
- ఈ ఆర్టికల్ తాత్కాలిక ఏర్పాటు మాత్రమే • కాశ్మీర్ అన్ని రాష్ట్రాలతో సమానమే
- లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంత చేయడం సరైనదే • రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నించలేం
- కాశ్మీర్ స్వయంప్రతిపత్తిపై సుప్రీ ధర్మాసనం తీర్పు • త్వరగా కాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలన్న సిజెఐ

న్యూఢిల్లీ,డిసెంబర్11 **జనవాహిని**

జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దును సుప్రీం కోర్టు సమర్థించింది. ఇది రాజ్యాంగబద్ధమే అని సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువ రించింది. ఆర్టికల్ 307 రద్దుని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. ఇది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని, పార్లమెంటు నిర్ణయాన్ని కొట్టిపారేయలేమని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ వివరించారు. జమ్మూ కశ్మర్ భారతదేశంలో చేరినప్పుడు సార్వభౌ మాధికారం లేదని, కేంద్రం తీసుకునే ప్రతి చర్యనూ



సవాలు చేయకూడదని సీజేఐ పేర్కొన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లు తీర్పు వెలువరించారు. ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి కేంద్రానికి రాష్ట్రం అనుమతి అవసరం లేదని సీజేఐ పేర్కొన్నారు. ఇదే సందర్భం లో జమ్మూ,కాశ్మీర్‌లో వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. జమ్మూకశ్మీర్ అంశంలో రాష్ట్రపతి ప్రకటనపై జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఈ సం దర్భంగా ఆర్టికల్ 370 రద్దుపై కేంద్రం వాదనలను సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఆర్టికల్ 370 అనేది తాత్కాలిక నిబంధన

- మిగతా 2లో పేజిలో

# మధ్యప్రదేశ్ సిఎంగా మోహన్ యాదవ్

బిజెపి అధిష్టానం సంచలన నిర్ణయం

శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పక్కన పెట్టిన పార్టీ


2లో

# మరోమైలురాయి చేరిన లోకేశ్ పాదయాత్ర

- 3 వేల కిలోమీటర్లు పూర్తితో పైలాన్ ఆవిష్కరణ

పాదయాత్రలో లోకేశ్‌తో కలసి నడిచిన బ్రాహ్మణి,దేవాన్ష్


2లో

# సిఎం రేవంత్ బిజీ

ఉద్యోగ ఖాళీలు...భర్తీలపై ఆరా

పూర్తి వివరాలతో రావాలని టీఎస్పీఎస్సీకి ఆదేశాలు

రైతుబంధు చెల్లింపులపై అధికారులతో సమక్ష

హైదరాబాద్,డిసెంబర్1జనవాహిని

వరుస సమీక్షలతో సచివాల యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బిజీబిజీగా ఉన్నారు. ప్రధానంగా ఆయన సోమవారం వ్యవసాయం ,నిరుద్యోగ రంగాలపై దృష్టి సారించారు. ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్ సమీక్షించారు. పూర్తి వివరాలతో రావాలని టీఎస్పీఎస్సీ అధికారులను సీఎం ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు టీఎస్పీఎస్సీ భర్తీ చేసిన ఉద్యోగాల వివరాలు, నోటిఫికేషన్ల వివరాలతో రావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒకటొకటిగా నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. తాజాగా ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టారు. తాము




అధికారంలోకి రాగానే ఖాళీల భర్తీ చేపడతామని మేనిఫెస్టోలో ప్రకటించడమే కాకుండా, ఏయే రోజున ఏయే నోటిఫికేషన్లు విడుదల అవుతాయో వివరంగా పేర్కొన్నారు. ఇందులో

- మిగతా 2లో పేజిలో

# వైసిపికి ఆళ్ల రామకృష్ణారెడ్డి షాక్

- పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా హఠాత్ నిర్ణయంతో పార్టీలో కలకలం
- స్థానిక రాజకీయాలే కారణమంటున్న అనుచరులు



వివరాలు 2లో

# విద్యుత్‌శాఖలో? రూ.85 వేల కోట్లు అప్పు

- తెలంగాణలో ప్రతిశాఖపైనా శ్వేతపత్రం
- రైతుబంధు సకాలంలో అందచేస్తాం
- వందరోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి


2 లో

# మేడిగడ్డలో తప్పుచేసిన వారికి శిక్ష తప్పదు

2లో



- తెలంగాణలో నీటిపారుదల రంగానికి ప్రాధాన్యం
- పారదర్శకంగా ప్రాజెక్టుల వివరాలు ఉండాలి
- జలసౌధలో అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష

# కేసీఆర్ త్వరగా కోలుకోవాలి

హైదరాబాద్: జనవాహిని

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ప్రముఖులు పరామర్శిస్తున్నారు. కాలి తుంటి గాయంతో సర్జరీ అయిన ఆయన నగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రాజకీయ ప్రముఖులు ఆయన దగ్గరకు క్యూ కడుతున్నారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడితో పాటు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తాజాగా కేసీఆర్‌ను పరామర్శించి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. కేసీఆర్‌ను పరామర్శించిన



అనంతరం చంద్రబాబు మిడియాతో మాట్లాడారు. 'కేసీఆర్‌ను పరామర్శించాను. డాక్టర్లు కూడా ఆపరేషన్

- మిగతా 2లో పేజిలో

# జానా ఇంటికి రేవంత్ రెడ్డి

మర్యాదపూర్వకంగా పెద్దాయనతో భేటీ



హైదరాబాద్,డిసెంబర్11జనవాహిని

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కె జానారెడ్డి ఇంటికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనను ఆప్యాయంగా కలిశారు. రేవంత్‌ను జానారెడ్డి దంపతులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో ఇద్దరు గంటసేపు చర్చించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఆదేశిస్తే నల్లగొండ నుంచి ఎంపిగా పోటీ చేస్తానని వివరణ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 15 ఏళ్లు మంత్రిగా సేవలు అందించాలని, తన కుమా రుడు జైవీర్ ఎంఎల్‌ఏగా గెలిచారని, పదవి మాత్రం అడగ లేదన్నారు.

- మిగతా 2లో పేజిలో

# 370 ఆర్టికల్ రద్దు సమర్ధనీయమే

(మొదటి పేజి (తరువాయి)

మాత్రమే అని, శాశ్వతం కాదని స్పష్టం చేసింది. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సోమవారం తమ నిర్ణయాన్ని ప్రకటించింది. రాజ్యాంగబద్ధంగానే ఆర్టికల్ 370 రద్దు నిర్ణయం జరిగిందని తెలిపింది. రాజ్యాంగంలోని అన్ని అంశాలూ కశ్మీర్‌కు వర్తిస్తాయని, మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో జమ్మూకశ్మీర్ సమానమే అని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 370 రద్దు వెనుక ఎటువంటి దురుద్దేశం కనిపించడం లేదని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యా నించింది. ఈ మేరకు కేంద్రం నిర్ణయానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. జమ్మూ కశ్మీర్ కు ప్రత్యేక హోదా కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 ని 2019 ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. అనంతరం జమ్మూ- కశ్మీర్ ను రెండు కేంద్రపాలిత (జమ్మూ-కశ్మీర్, లడఖ్) ప్రాంతాలుగా ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పులోని ముఖ్యమైన అంశాలు ఇలావున్నాయి. భారత యూనియన్‌లో చేరిన ప్పుడు జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక సార్వభౌమత్వం లేదని సీజేఐ వ్యాఖ్యానించారు. భారత రాజ్యాంగంలోని ప్రతి నిబంధనను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి అవసరం లేదని కూడా సీజేఐ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 తాత్కాలిక నిబంధన. రాష్ట్రంలో యుద్ధ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. జమ్మూకాశ్మీర్ కూడా అన్ని రాష్ట్రాల లాంటిదే. ఇతర రాష్ట్రాలకు విభిన్నంగా అంతర్గత సార్వభౌమాధికారం లేదు. ఈ మేరకు రాజ్యాంగంలో కూడా ప్రస్తావన లేదు. లద్దాఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా పునర్వ్యవస్థీకరించడం సమర్థనీయం అనిఅన్నారు. ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చవచ్చా.. లేదా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదని సీజేఐ అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 370 ముఖ్య ఉద్దేశ్యం జమ్మూ కాశ్మీర్‌ను నెమ్మదిగా దేశంలోని ఇతర రాష్ట్రాలతో సమానంగా తీసుకురావడమేనని జస్టిస్ కౌల్ పేర్కొన్నారు. డొంక దారిలో నిబంధనల సవరణ సరికాదు. ఒక విధానాన్ని సూచించినప్పుడు దానిని తప్పకుండా అనుసరించాలి. ఆర్టికల్ 367 ఉపయోగించి ఆర్టికల్ 370 సవరణ పక్రియ చేపట్టడంపై జస్టిస్ కౌల్ స్పష్టత ఇచ్చారు. ప్రభుత్వం 'నిష్పాక్షిక నిజం, సయోధ్య కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ అంశంతో ముడిపడి ఉన్న సున్నితమైన అంశాలను పరిగణలోకి తీసుకోవా లని జస్టిస్ కౌల్ సిఫార్సు చేశారు. ఇదిలావుండగా తీర్పు నేపథ్యంలో కశ్మీర్ అంతటా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. తీర్పును రాజకీయం చేయవద్దంటూ బీజేపీ కోరింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోమని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ కూటమిగా జమ్ము-కశ్మీర్ పార్టీలు ఏర్పడ్డాయి. గుప్కార్ అలయన్స్ పేరుతో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పిటిషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ ఏడాది ఆగస్ట్ 2 నుంచి ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపింది. మొత్తంగా ఆర్టికల్ 370ను రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉందని ధర్మాసనం పేర్కొంది. హక్కుల విషయంలో జమ్ముకశ్మీర్ కు ప్రత్యేకత ఏమీ లేదు. మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో అది సమానమే. ఆర్టికల్ 1, ఆర్టికల్ 370 ప్రకారం భారత్ లో జమ్మూకశ్మీర్ అంతర్భాగమే. కేంద్రం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని సవాల్ చేయడం సరికాదు. 370 ఆర్టికల్ రద్దు అంశంపై ఇప్పటికే 3 తీర్పులు ఉన్నాయి. గత తీర్పులను పిటిషనర్లు సవాల్ చేయలేదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా జమ్ముకశ్మీర్ నుంచి లద్దాఖ్ ను విభజించి దాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించడాన్ని సైతం సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ప్రస్తుతం, జమ్మూకశ్మీర్ లో రాష్ట్ర హోదాను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని కేంద్రాన్ని ఆదేశించింది. 2024, సెప్టెంబర్ 30లోగా జమ్మూకశ్మీర్ లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సూచించింది. జమ్మూకశ్మీర్ కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ను కేంద్ర ప్రభుత్వం 2019 ఆగస్ట్ 5న పూర్తిగా రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని 2 కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ జమ్మూకశ్మీర్ కు చెందిన పలు పార్టీలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ ఏడాది ఆగస్ట్ 2 నుంచి సుదీర్ఘంగా విచారించింది. సెప్టెంబర్ 5న తీర్పును రిజర్వ్ చేసి సోమవారం తాజాగా తీర్పు వెలువరించింది. కీలక తీర్పు వెలువడిన నేపథ్యంలో అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలను చేపట్టింది. గత రెండు వారాలుగా కశ్మీర్ లోయలోని 10 జిల్లాల్లో పోలీసులు భారీగా మోహరించారు. ఇప్పటికే కొందరు నాయకులను అదుపులోకి తీసుకోగా, మరికొందరిని గృహ నిర్బంధంలో ఉంచారు. ప్రజలను రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# సిఎం రేవంత్ బిజీ



(మొదటి పేజి (తరువాయి)

భాగంగా రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీలు ఎన్ని ఉన్నాయో తెలపాలని టిఎస్ పిఎస్ సి చైర్మన్ జనార్దనరెడ్డిని సిఎం ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటినుంచి ఇప్పటివరకూ ఎన్ని ఖాళీలు భర్తీ అయ్యాయో కూడా తెలపాలన్నారు. ఉద్యోగాల భర్తీపై రెండు రోజుల్లో సమీక్ష నిర్వహిస్తామనీ, దీనికి పూర్తి వివరాలతో హాజరు కావాలని ఆయన టీఎస్ పిఎస్ సి చైర్మన్ ను ఆదేశించారు. రైతు భరోసా పథకంపై కూడా సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అధికారులు హాజరయ్యారు. సచివాలయంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం అధికారులతో.. ఎక్సైజ్ శాఖ అధికారులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు , ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. రైతు భరోసాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సంబంధిత అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకంపై చర్చించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఖాతాల్లో ఏడాదికి ఎకరానికి రూ. 15వేలు, వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలు, వరి పంటకు రూ. 500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిధుల విడుదలపై సీఎం రేవంత్ రెడ్డి సీమీక్షించారు. అయితే, ప్రభుత్వ ఖజానాలో మాత్రం నిధులు లేనట్లు తెలుస్తోంది. డిసెంబర్ చివరి వారంలో యాసంగికి రైతులు సిద్ధమవుతున్న తరుణంలో ఎలాగైన నిధులు సర్దుబాటు చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నట్లు సమాచారం

## వైసిపికి ఆళ్ల రామకృష్ణారెడ్డి షాక్

గుంటూరు,డిసెంబర్11: మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వైసీపీకి షాక్ ఇచ్చారు. పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. పార్టీకి రాజీనామా చేయాల్సినంత అవసరం ఏమిటన్నది ఇప్పుడు ఆ పార్టీలో హాట్ టాపిక్ అయింది. ఆళ్ల రామకృష్ణారెడ్డి మంగళగరి నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. రెండో సారి ఆయన లోకేష్‌పై గెలిచారు. వైఎస్సార్‌సీపీ కీలక నేత, మంగళగిరి శాసన సభ్యుడు ఆళ్ల రామకృష్ణ రెడ్డి పార్టీతో పాటు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం కలకలం రేపుతోంది. రాజీనామా అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. 2014 నుండి 2019 వరకు ఒకసారి, 2019 నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు. నీతీనిజాయితీలతో ధర్మంగా శాసనసభ్యుడిగా పనిచేశానని, ఒక వైపు బాధగా ఉన్నప్పటికీ కఠినమైన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. మొదటగా శాసన సభ్యుడిగా రాజీనామా చేశానని, స్పీకర్ ఫార్మాట్‌లో లేఖ ఇచ్చానని వెల్లడించారు. స్పీకర్ అందుబాటులో లేకపోవడంతో స్పీకర్ ఓఎస్‌డీకి లేఖను అందించినట్లు చెప్పారు. తన రాజీనామాను ఆమోదించమని కోరానని తెలిపారు. 1995 నుంచి రాజకీయాల్లో ఉన్నానన్నారు. ఆ రోజు నుంచి కాంగ్రెస్ పార్టీలో రాజశేఖర్ రెడ్డి కోసం పనిచేశానని.. 2004లో కాంగ్రెస్ నుంచి సత్తెనపల్లి సీట్ ఆశించి భంగపడ్డానన్నారు. 2009లో పెదకూరపాడు సీట్‌ను కాంగ్రెస్ నుంచి ఆశించి భంగపడ్డానన్నారు. అయినా కూడా కాంగ్రెస్ కోసం పనిచేశానన్నారు. వ్యక్తిగత కారణాలతో ఎమ్మెల్యే పదవికి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ఇన్నాళ్లు తనకు రాజకీయంగా అవకాశం కల్పించినందుకు జగన్మోహన్ రెడ్డికి ఆళ్ల రామకృష్ణారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఆళ్ల రామకృష్ణారెడ్డి సోదరుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి వైసీపీ అధినేత జగన్ కు అత్యంత సన్నిహితుల్లో ఒకరు. కోస్తా జిల్లాల బాధ్యతలన్నీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డినే చూసుకుంటారు. ఆయన రాజ్యసభ ఎంపీ కూడా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పటి నుంచి అనుబంధం ఉంది. ఆళ్ల అయోధ్య రామిరెడ్డికి ఆయన కుటుంబసభ్యులు రాంకీ సంస్థ యజమానులు. ఆళ్ల రామకృష్ణారెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి టీడీపీపై పోరాటం చేస్తున్నారు.

టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మంగళగిరి ఎమ్మెల్యేగా పలు రకాల పిటిషన్లు కోర్టుల్లో వేశారు. అమరావతిపై ఎన్జీటీలో పిటిషన్లు వేసిన వారికి సాయం అందించారు. టీడీపీ హయాంలో ఓ అధికారి ఏసీబీకి పట్టుబడిన సమయంలో .. ఆళ్ల రామకృష్ణారెడ్డి పేరు వెలుగులోకి వచ్చింది. ఆ అధికారి ఆస్తులకు ఆమె బినామీగా ఉన్నారని పోలీసులు గుర్తించారు.

## మధ్యప్రదేశ్ సిఎంగా మోహన్ యాదవ్

న్యూఢిల్లీ,డిసెంబర్11 బిజెపి అధిష్టానం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఎంపికలో బీజేపీ హైకమాండ్ సంచలన నిర్ణయం తీసుకుంది. సీఎం రేసులో ఉన్న సీనియర్ నాయకులు అందరినీ పక్కన పెట్టి.. అసలు రేసులోనే లేని మోహన్‌యాదవ్‌కు సీఎం పదవి కట్టబెట్టింది. ఈ మేరకు మధ్యప్రదేశ్ బీజేపీ శాసనసభా పక్షం సమావేశమై తమ నాయకుడిగా మోహన్ యాదవ్‌ను ఎన్నుకున్నది. దాంతో గత 8 రోజుల మధ్యప్రదేశ్ సీఎం ఎంపికపై నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది. కాగా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఎంపిక కోసం అంతకుముందు బీజేపీ హైకమాండ్ హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్, తెలంగాణకు చెందిన బీజేపీ జాతీయ నాయకుడు డాక్టర్ కే లక్ష్మణ్, ఆశా లక్రాలతో కేంద్ర పరిశీలకులుగా నియమించింది. ఈ పరిశీల సమక్షంలోనే కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలు తమ నాయకుడిగా మోహన్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇక ఉప ముఖ్యమంత్రులుగా జగదీష్ దేవ్డా, రాజేశ్ శుక్లాలు ఎన్నికయ్యారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా నరేంద్రసింగ్ తోమర్‌ను ఎంపిక చేశారు. మధ్యప్రదేశ్ కొత్త ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఉజ్జయిని సౌత్ నియోజకవర్గం నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయనకు గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్నది. ఇప్పటి వరకు నాలుగు పర్యాయాలు పనిచేసిన శివరాజ్ సింగ్ చౌహాన్‌ను బిజెపి పక్కన పెట్టింది. ఛత్తీస్‌ఘడ్‌లో కూడ ఆరమణ్ సింగ్‌ను పక్కన పెట్టిన సంగతి తెలిసిందే.

## విద్యుత్‌శాఖలో రూ.85 వేల కోట్లు అప్పు

సిద్దిపేట,డిసెంబర్11: విద్యుత్‌శాఖలో రూ. 85 వేల కోట్లు అప్పు ఉందని, తెలంగాణలో ఉన్న ప్రతి శాఖపై శ్వేతపత్రం విడుదల చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలన నచ్చక కాంగ్రెస్‌కు ప్రజలు అవకాశం ఇచ్చారని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రిగా పొన్నం ప్రభాకర్ మొదటిసారిగా సిద్ధిపేటకు వచ్చారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు పొన్నానికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బిసి బంధుపై సమీక్షించి ఆలోచన చేస్తామని, మూడు రాష్ట్రాల్లో గెలిచినా ఇప్పటికి బిజెపి సిఎంలను నియమించలేదని పొన్నం చురకలంటిం చారు. ఆర్‌టిసి కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. అనేక బాధ్యతల ద్వారా ఎదిగానని.. ఎప్పటికీ ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. మనముందు ఉన్న కర్తవ్యం పెద్దది అని.. గత పాలకుల తీరు నచ్చక కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. ఆరు గ్యారంటీల్లో రెండు అమలు చేస్తున్నామని చెప్పారు. ఆచరణలో లోపాలను ప్రతి 15 రోజులకోసారి సమీక్షించుకుని ముందుకు వెళతామన్నారు. రోజు 45 లక్షల మందిని, 35 లక్షల కిలోమీటర్లు ఆర్టీసీ తిరుగుతుందని తెలిపారు. ఆర్టీసీని మరింత ప్రజలకు చేరువ చేస్తామన్నారు. జిల్లా అభివృద్ధి విషయంలో మంత్రిగా, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా బాధ్యత తీసుకుంటానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం మన భాధ్యతగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. వంద రోజుల కాలంలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. పార్టీలకు అతీతంగా పని చేస్తామన్నారు. సమస్య ఉంటే పార్టీ ఏదైనా తమ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. నియంతృత్వం తమ విధానం కాదన్నారు. గూగుల్ మ్యాప్‌లు నీళ్ళల్లోకి తీసుకు పోతున్నాయని.. గూగుల్‌కు లెటర్ రాయాలని కలెక్టర్‌కు ఆదేశించానన్నారు. గౌరవెల్లి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయమని చెప్పానన్నారు. బీసీ బందులో అవకతవకలపై సమీక్ష జరుపతామన్నారు. విద్యుత్ శాఖకు మాత్రమే 85 వేల కోట్ల అప్పు ఉందని తెలుస్తోందన్నారు. గత ప్రభుత్వం రైతుబంధు ఎప్పుడూ డిసెంబర్ చివరి వారంలో ఇచ్చిందని.. ఖచ్చితంగా రైతులకు రైతుబంధు ఇస్తామన్నారు. ప్రతి శాఖకు సంబంధించి వైట్ పేపర్ రిలీజ్ చేస్తామన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, సంస్థ మనుగడ కోసం కృషి చేస్తామన్నారు. పార్టీ శ్రేణులు, పోటీ చేసిన అభ్యర్థుల ఆధ్వర్యంలోనే పార్టీ కార్యక్రమాలు జరుగుతాయని.. వర్గాలకు, విభేదాలకు తావివ్వద్దని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

## కెసిఆర్‌కు టిడిపి అధినేత చంద్రబాబు పరామర్శ



హైదరాబాద్,డిసెంబర్11: ఇటీవల తుంటి మార్పిడి శస్త్ర చికిత్స చేయి ంచుకున్న తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను చంద్రబాబు పరా మర్శించారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యు లను అడిగి చంద్రబాబు వివరాలు తెలుసుకున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు హైదరాబాద్ సోమాజి గూడలోని యశోద ఆస్పత్రికి వెళ్లారు. కేసీఆర్‌ను పరామర్శించిన తర్వాత చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌కు జరిగిన తుంటి మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా జరిగిందని డాక్టర్లు చెప్పారని.. ఆయన కోలుకునేందుకు ఆరు వారాల సమయం పడుతుందని వివరించారని చంద్రబాబు చెప్పారు. కేసీఆర్ త్వరగా కోలుకుని.. మళ్లీ ప్రజాసేవలో పునరంకితం కావాలని ఆకాంక్షి స్తున్నట్లు చంద్రబాబు అన్నారు. కేసీఆర్‌ను పరామర్శించేందుకు ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ యశోద ఆసుపత్రికి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి పరామర్శించారు. కేసీఆర్ గారి ఆరోగ్యపరిస్థితి గురించి ఆరా తీశారు. కోలుకుంటున్న విషయం తెలుసుకున్నారు. అక్కడే ఉన్న ఎమ్మెల్సీ కవితను సైతం ప్రకాష్ రాజ్ పరామర్శించారు.

# కేసీఆర్ త్వరగా కోలుకోవాలి

(మొదటి పేజి (తరువాయి)

బాగా చేశారని చెప్పారు. ఆయన కోలుకోవడానికి ఆరువారాల టైం పడుతుందని డాక్టర్లు చెప్పారు. ఆయన త్వరగా కోలుకోవాలి. కోలుకుని మళ్లీ ప్రజా సేవకు రావాలి. జీవితంలో ఒడిదుడకులు రావటం సహజం. ప్రజలకు అంకిత భావంతో మళ్ళీ ఆయన సేవ చేయాలని కోరుకుంటున్నా" అని చంద్రబాబు అన్నారు. మరోవైపు డిప్యూటీ సీఎం, మంత్రి మల్లు భట్టి విక్రమార్క కేసీఆర్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్‌ను పరామర్శించేందుకు రాజకీయంతో పాటు సినీ ప్రముఖులు తరలి వస్తుండడం గమనార్హం.ద

## జానా ఇంటికి రేవంత్ రెడ్డి

(మొదటి పేజి (తరువాయి)

తన కుమారుడు ఇప్పుడు జూనియర్‌గా ఉన్నారని ఇంకా నేర్చుకుంటున్నాడని, ఇప్పుడే పదవులు అడగలేమని జానా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అందరూ సహకరించాలని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజాభిమానం సొంతం చేసుకోవాలని రేవంత్ రెడ్డికి జానా సూచించారు. సిఎం, మంత్రులు అందరూ కలిసి పని చేయాలని, తాను ఇప్పుడు ప్రభుత్వంలో భాగస్వామిగా లేనన్నారు. ప్రజలు ఇచ్చిన ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేయాలని ఆయన స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు గాయం కావడం బాధాకరమైన విషయమని, ఆయనని పరామర్శించానని, కెసిఆర్ త్వరగా కోలుకోవాలని, ప్రతిపక్షనాయకుడిగా ఆయన సూచనలు తెలంగాణ ప్రభుత్వానికి చాలా అవరసమన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా జానా రెడ్డి ఇంటికి వెళ్లి కలిశారు. ప్రస్తుత రాజకీయాలపై ఇద్దరు చర్చలు జరిపినట్టు సమాచారం. సర్కారులో ఇబ్బందులను, బాధలను తెలియజేయడం శుభపరిణామమన్నారు. సీఎం రేవంత్ తనను కలిశారని.. ప్రజాభిమానం చూరగొనేలా పనిచేయాలని చెప్పానన్నారు. ప్రభుత్వంలో తన పాత్ర ఏమి ఉండదన్నారు. కానీ తన సలహాలు, సూచనలు కావాలంటే ఇస్తానన్నారు. కేసీఆర్ హాస్పిటల్‌లో ఉండడం చాలా బాధాకరమన్నారు. తాను వెళ్లి కలిసే ప్రయత్నం చేశాను కానీ కేసీఆర్ నిద్రలో ఉన్నారని జానారెడ్డి తెలిపారు. కేటీఆర్, హరీష్‌లను కలిశానన్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. పార్లమెంట్‌కు పోటీ చేస్తానని గతంలో చెప్పానన్నారు. అధిష్టానం ఆదేశిస్తే ఆలోచిస్తానని తెలిపారు.

## మేడిగడ్డలో తప్పుచేసిన వారికి శిక్ష తప్పదు

హైదరాబాద్,డిసెంబర్11 కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్‌లో తప్పు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. మేడిగడ్డ కుంగుబాటు, డిజైన్ లోపం తదితర అంశాలపై ఆరా తీసారు. సోమవారం నాడు జలసౌధలో నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ శాఖలకు సంబంధించిన కీలక అంశాలపై మంత్రి చర్చించారు. ఈ సమావేశంలో ఈఎన్సీ మురళీధరతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టుల వారీగా మంత్రి ఉత్తమ్ సమీక్ష చేశారు. ప్రాజెక్టులకు అవుతున్న విద్యుత్ వినియోగంపై మంత్రి ఆరా తీశారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టు తదితర ప్రాజెక్టులపై లోతుగా సమీక్ష జరిపారు. ఈ శాఖకు సంబంధించిన అధికారులతో మంత్రి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ శాఖపై ఉత్తమ్ ముందు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కాళేశ్వరం, మేడిగడ్డపై ఉత్తమ్ ప్రత్యేకంగా వివరాలు అడిగారు. త్వరలో మేడిగడ్డ బ్యారేజ్‌ని పరిశీలించడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ... మేడిగడ్డ విషయంలో విచారణ జరగాలి. నీటి పారుదల శాఖలో పనులు అత్యంత పారదర్శకంగా ఉండాలి. ప్రజల డబ్బులతో మనం ప్రాజెక్టులను కడుతున్నాం. మనం పూర్తిగా బాధ్యతాయుతంగా,

జవాబు దారి తనంతో పని చేయాలి(.తెలంగాణలో నీటి పారుదల రంగానికి చాలా ప్రాధాన్యత ఉంది. అది గుర్తు పెట్టుకొని మనం పని చేయాలి. ప్రజల్లో నీటి పారుదల రంగంపై ఉన్న అపోహలు తొలగిపోయేలా పని చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు

## మరోమైలురాయి చేరిన లోకేశ్ పాదయాత్ర



కాకినాడ,డిసెంబర్11?: టిడిపి యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర చారిత్రాత్మక మైలు రాయిని అధిగమించింది. సోమవారం యువగళం పాదయాత్ర 3 వేల కిలోమీటర్ల మైలురాయిని చేరుకుంది. తుని నియోజకవర్గం తేటగుంట పంచాయతీలో ఈ మజిలీకి గుర్తుగా పేదల ఆకలి తీర్చే అన్నాక్యాంటీన్లను కొనసాగిస్తామని హామీ ఇస్తూ శిలాఫలకాన్ని లోకేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సతీమణి నారా బ్రాహ్మణి, కొడుకు దేవాన్ష్, మోక్షజ్ఞ, భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తేటగుంట జాతీయ రహదారి జనసంద్రంగా మారింది. తుని నియోజకవర్గం తేటగుంట వద్ద పండుగ వాతావరణం నెలకొంది. లోకేష్‌తో కలిసి కుటుంబసభ్యులు నారా బ్రహ్మణి, దేవాన్ష్, మోక్షజ్ఞ, భరత్ పాదయాత్ర చేస్తున్నారు.

చారిత్రాత్మక మైలురాయి చేరుకున్న సందర్భంగా ఆనందంతో యువగళం బృందాలు కేరింతలు కొడుతున్నారు. వేలాది కార్యకర్తలు, అభిమానుల రాకతో జాతీయ రహదారి కోలాహలంగా మారింది. లోకేష్‌కు సంఘీభావం తెలుపుతూ టీడీపీ ముఖ్య నేతలు పాదయాత్రలో పాల్గొన్నారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలాదిగా అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. శిలాఫలకం ఆవిష్కరణ అనంతరం లోకేష్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం కల్పించిన అన్ని అడ్డంకులను అధిగమిస్తూ ప్రజలే సైన్యంగా యువగళం పాదయాత్ర 3000 కి.మీ. మైలురాయికి చేరింది. తుని నియోజకవర్గం తేటగుంట పంచాయతీలో ఈ మజిలీకి గుర్తుగా వైసీపీ సర్కారు మూసేసిన పేదల ఆకలి తీర్చే అన్నాక్యాంటీన్లు మళ్లీ ప్రారంభిస్తామని హామీ ఇస్తూ శిలాఫలకం ఆవిష్కరించానని యువనేత పేర్కొన్నారు.

# ప్రజల కోసం పని చేసే ప్రభుత్వమే ప్రజా ప్రభుత్వం....

## వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్.

వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 10( జనవాహిని న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ లలో భాగంగా మొట్ట మొదట ప్రకటించిన మహాలక్ష్మి పథకం మరియు రాజీవ్ ఆరోగ్య శ్రీ బీమా మరియు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మొదటగా రెండు గ్యారెంటీ పథకాలను అమలు చేశాం మరో నాలుగు పథకాలను 90 రోజుల్లో అమలు చేస్తామని ఆయన అన్నారు. ప్రజలు మమ్మల్ని నమ్మి గెలిపించినందుకు ప్రజలకు ధన్యవాదాలు మేము వారి విజయాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు మంచి పాలన అందించే ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డిఓ విజయ కుమారి, జిల్లా వైద్య శాఖ అధికారి పాల్వాన్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు మరియు మున్సిపల్ ఫోర్ లీడర్ అర్ద సుధాకర్ రెడ్డి, అధికారులు మరియు వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## శ్రీ కొత్తూరు సుబ్బరాయనికి బంగారు గొలుసు, వెండి నాగపడిగె విరాళం..!

### – ఆలయ ఈవో యం.రామకృష్ణ.




నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 11. జనవాహిని న్యూస్.ప్రముఖ శైవక్షేత్రం వేలాది మంది భక్తుల ఆరాధ్యదైవం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి 23 గ్రాముల బంగారం గొలుసు, తాళిబొట్టు, 795 గ్రాముల వెండి నాగపడిగెను భక్తులు ఆదివారం వితరణ చేసినట్లు ఆలయ ఈవో యం. రామకృష్ణ తెలిపారు.

పాణ్యం మండలం కొనిదేడు గ్రామానికి చెందిన గండికోట రామనాయుడు ధర్మపత్ని జి.లక్ష్మీదేవి 20 గ్రా" 800 మి.గ్రా" బంగారు పుస్తెల గొలుసు, తాళిబొట్టు మరియు నంద్యాల పట్టణము చెందిన సి.సురేష్ రెండు గ్రా" 600 మి.గ్రా" చిన్న బంగారు చుట్టపడిగె, కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన నరేష్ కృష్ణ యాదవ్ కుమారుడు లోకాంక్ష కృష్ణ యాదవ్ 795 గ్రా" వెండి నాగపడిగెను వితరణ చేసినట్లు ఈవో తెలిపారు. దాతలకు శ్రీ స్వామి వారు ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కుబడిగా విరాళములు అందించి నట్లు భక్తులు తెలిపారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో స్వామివా రికి అభిషేకములు, అర్చనలు నిర్వహించి, సత్కరించి ప్రసాదము అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు నారాయణస్వామి సిబ్బంది, దాతల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాశ్మీర్‌లో ఎన్నికల నిర్వహణ

### రాష్ట్రప్రతిపత్తిని పునరుద్ధరించాలి

### 370 రద్దు నేపథ్యంలో సుప్రీం ఆదేశాలు




న్యూఢిల్లీ,డిసెంబర్11): జమ్ముకశ్మీర్ లో ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన తరుణంలో అక్కడ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ధర్మాసనం ఈసీని ఆదేశించింది. కశ్మీర్ రాష్ట్ర హోదాను త్వరగా పునరుద్ధరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించింది. 2024 సెప్టెంబర్ 30కల్లా ఎన్నికలు పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 2019 ఆగస్టులో లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా విభజించాలనే నిర్ణయాన్ని సమర్థించింది. తీర్పు నేపథ్యంలో అక్కడ భద్రతను కట్టుదిట్టం చేశారు. కోర్టు నిర్ణయాన్ని గౌరవించాలని బీజేపీ కోరింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోమని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ కూటమిగా జమ్ము-కశ్మీర్ పార్టీలు ఏర్పడ్డాయి. గుప్కార్ అలయన్స్ పేరుతో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పిటిషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ ఏడాది ఆగస్ట్ 2 నుంచి ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపింది. 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు చేస్తూ పార్లమెంట్ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన పలు జమ్ము-కాశ్మీర్ రాజకీయ పార్టీలు సుప్రీంను ఆశ్రయించాయి.

## తీర్పు నేపథ్యంలో కాశ్మీర్‌లో భద్రత

### ముఫ్తీని గృహనిర్బంధం అంటూ వార్తలు

### తోసిపుచ్చిన లెఫ్టినెంట్ గవర్నర్



శ్రీనగర్,డిసెంబర్1 జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దుచేయడంపై సుప్రీం కోర్టు తీర్పును వెలువరించే క్రమంలో కేంద్రపాలిత ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. శ్రీనగర్ సహా సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా బలగాలను మోహరించింది. పలువురు నేతలను గృహనిర్బంధం చేసింది. వారిలో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ చీఫ్ మెహబూబా ముఫ్తీ కూడా ఉన్నారు. ఈమేరకు పార్టీ సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించింది. సుప్రీంకోర్టు తీర్పును వెళ్లడించడానికి ముందే.. పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ ఇంటికి పోలీసులు తాళాలు వేశారని, ఆమెను గృహ నిర్భందంలో ఉంచారు. అయితే ఈ ఆరోపణలను జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కొట్టిపారేశారు. తమ ప్రభుత్వం ఎవరినీ హౌస్ అరెస్టు చేయలేదని స్పష్టంచేశారు. అది పూర్తిగా నిరాధారమైనదని వెల్లడించారు. రాజకీయ కారణాలతో ఇప్పటివరకు ఎవ్వరినీ అరెస్టు చేయలేదని, గృహ నిర్బంధంలో ఉంచలేదని తెలిపారు. ఇది కేవలం పుకార్లను వ్యాప్తి చేయడానికే ఇదంతా చేస్తున్నారని పేర్కొన్నారు.

## ఘనంగా శిల్పా వారి కార్తీక వనభోజన మహోత్సవం..!




నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 11. జనవాహిని న్యూస్. కార్తీక మాసం సందర్భంగా శిల్పా సేవా సమితి ఆధ్వర్యం లో ప్రథమ నంది దేవస్థానం వైయస్సార్ కళ్యాణ మండప ంలో ఏర్పాటు చేసిన వనభోజనాల కార్యక్రమ ంలో పాల్గొన్నరు ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి,నాగిని రవి సింగిరెడ్డి కార్తీక వనభోజనం మహోత్సవంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.

ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుండి కార్తీక మాసంలో నంద్యాల పట్టణంలోని మహిళలందరికీ శిల్పా సేవ సమితి ద్వారా కార్తిక వనభోజనాలు ఏర్పాటుచేసి మహిళలందరూ పండగ వాతావరణం లో ఒకే చోట చేరి ఆనందాన్ని పంచుకోవడం అదేవిధంగా మా కుటుంబ సభ్యులను వారి కుటుంబం సభ్యులుగా భావించడం ఎంతో సంతోషకరంగా ఉందని అదేవిధంగా నేడు కార్తీకమాసం సందర్భంగా ప్రథమనంది దేవస్థానం నందు నంద్యాల నియోజకవర్గంలోని మహిళలందరికీ కార్తిక వనభోజనం ఏర్పాటు చేయడం జరిగిందని కార్తీక మాసంలో మహిళలందరూ భక్తిశ్రద్ధలతో దేవుడిని పూజిస్తుంటారని అలాగే సేవాసమితి ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా అప్పుడప్పుడు మహిళలకు ఆనందాన్ని ఇచ్చే విధంగా ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాజకీయాలలో మా కుటుంబం గెలుపు ఓటములకు సంబంధం లేకుం డా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కొందరు ఎలక్షన్ల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వచ్చి మాయమాటలు చెప్పడం జరుగుతుందని ప్రజలు కూడా మంచి చేసేవారిని గుర్తుంచుకోవాలని మా కుటుంబంపై నంద్యాల నియోజకవర్గ ప్రజలందరూ వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఇలాగే ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుం టున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాబునిసా, మున్సిపల్ మహిళా కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు వార్డు ఇన్చార్జులు పట్టణంలోని మహిళలు పాల్గొన్నారు.

## డాక్టర్ మధుసూదనరావుకు జాతీయస్థాయి లైఫ్ టైం అచీవ్ మెంట్ పురస్కారం

నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 11. జనవాహిని న్యూస్.భారతదేశ చెవి ముక్కు గొంతు వైద్యుల సంఘం, నంద్యాలకు చెందిన ప్రముఖ చెవి ముక్కు గొంతు వైద్యులు డాక్టర్ చిత్తులూరి మధుసూదనరావు కు జాతీయస్థాయి జీవన సాఫల్య పురస్కారం (లైఫ్ టైం అచీవ్ మెంట్ పురస్కారం) ప్రకటించింది.

భారత దేశ చెవి ముక్కు గొంతు వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నందు కోల్వాడ్కర్, కార్యదర్శి డాక్టర్ కౌశల్ షేథ్ ఈ పురస్కారాన్ని ప్రకటిస్తూ డాక్టర్ మధుసూదనరావు చేసిన వైద్య సేవలతో పాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి తమ సంఘం యొక్క జాతీయస్థాయి అత్యున్నత పురస్కారాన్ని అందజేస్తున్నామన్నారు. డాక్టర్ మధుసూదన రావు గత మూడు దశాబ్దాలకు పైగా ప్రతి ఏటా పేదలకు ఉచిత శస్త్ర చికిత్సల నిర్వహణతో పాటు, పేద విద్యార్థులకు వడ్డీ రహిత రుణాల పంపిణీ, హిందూ స్మశాన వాటికల అభివృద్ధి, కళా క్రీడల అభివృద్ధి కోసం చేసిన కృషికి ఈ పురస్కారం అందిస్తున్నట్లుగా తెలిపారు. ఈ పురస్కారాన్ని జనవరి ఐదవ తేదీ బెంగళూరులో నాలుగు వేల మంది చెవి ముక్కు గొంతు వైద్యులతో నిర్వహించనున్న జాతీయ సదస్సులో అందజేస్తారు. ఈ జాతీయ అత్యున్నత పురస్కారం ప్రకటించిన సందర్భంగా డాక్టర్ మధుసూద



**జాతీయస్థాయి జీవన సాఫల్య పురస్కారం డాక్టర్ మధుసూదన రావు**

నరావుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఏ పాస్ట్ ప్రెసిడెంట్స్ ఫోరం చైర్మన్ డాక్టర్ జి.రవికృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ చంద్రశేఖర్, ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ వసుధ, డాక్టర్ పనిల్, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు అభినందనలు తెలిపారు.

## విజ్ఞాన యాత్ర ను బహిష్కరించిన కౌన్సిలర్ శ్యాం సుందర్ లాల్



నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 11. జనవాహిని న్యూస్. నంద్యాల మున్సిపా లిటీ ఆధ్వర్యంలో కౌన్సిలర్లకు చేపట్టిన విజ్ఞాన యాత్రను 12వ వార్డు కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్ లాల్ బహిష్కరిం చారు. తన వార్డులో జరిగిన గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమానికి మున్సి పల్ అధికారులు ప్రోటోకా ల్ పాటించకపోవడం పై, స్థానిక కౌన్సిలర్ అయిన తనను పిలువక పోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అధికారుల చర్యలకు నిరసన గా తాను కౌన్సిలర్ల విజ్ఞాన యాత్రను బహిష్కరిస్తునట్లు శ్యాం సుందర్ లాలు వెల్లడించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర వార్డులలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు పిలిచే అధికారులు తన వార్డులో జరిగే కార్యక్రమాలకు ఎందుకు పిలువలేదని అధికారులను ప్రశ్నించారు. ప్రతిపక్ష, స్వతంత్ర కౌన్సిలర్ లకు ప్రోటోకాల్ వర్తించదా అని ప్రశ్నించారు. ఉద్దేశ్య పూర్వకంగానే తనను పిలువలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే విజ్ఞాన యాత్ర పేరుతో కౌన్సిలర్ కు చేపట్టిన టూర్ ను తాను బహిష్కరిస్తునట్లు తెలిపారు. కౌన్సిల్ లో తీర్మానించిన వాటికే దిక్కు లేదు కేరళ లో జరిగిన సలీడ్ వెస్ట్ మేనేజ్మెంటూ, అక్కడ అభివృద్ధిని చూసి ఇక్కడ అభివృద్ధి చేస్తామంటే ప్రజలు నమ్మరని కేవలం విహార యాత్ర కోసం అభివృద్ధి ని సాకు చూపుతున్నారని, ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

## శ్రీ వరిసాగుపై చైతన్యం రావాలి

### రైతులు అవగాహన పెంచుకోవాలి

గుంటూరు,డిసెంబర్11 శ్రీ వరిసాగు యాజమాన్య పద్ధతులపై రైతులుఅవగాహన పెంచుకోవాలని పలువురు వ్యవసాయ వేత్తలు తెలిపారు. శ్రీవరి సాగు నారు నాటడం, విత్తనాలు ఎద జల్లడం రెండు విధాలుగా చేసుకోవచ్చన్నారు. నీటి యాజమన్య పద్ధతులే ప్రధానం అన్నారు. తక్కువ నీటితో ఎక్కువ ప్రయోజనం శ్రీ వరిసాగు విధానంగా వివరించారు. నత్రజని చాలా తక్కువ మోతాదులో వాడాలని, సేంద్రియ ఎరువులనే వినియోగించాలన్నారు.

డెల్టా ప్రాంతంలో నీటి ఎద్దడి తక్కువగా ఉన్నందున, తక్కువ నీటిని వినియోగిస్తూ ఎక్కువ విస్తీర్ణంలో శ్రీ వరిసాగు ద్వారా అధిక దిగుబడులు సాధించొచ్చన్నారు. ఈతరహాలో బళ్ళారిలో ఎకరాకు 66బస్తాల దిగుబడి సాధించగా, దుగ్గిరాల మండలం చిలువూరులో 48బస్తాలు, బుర్రిపాలెం రైతు 44బస్తాలు దిగుబడులు సాధించినట్లు వివరించారు. రైతు ప్రయోజనాలకు అనుగుణంగా నూతన వ్యవసాయ పద్ధతుల పట్ల అవగాహన కార్యక్రమాల ఏర్పాటు చేయడం పట్ల, రైతులు నిర్వాహకులను అభినందించారు. నీటి యాజమాన్య పద్ధతులు, సేంద్రియ ఎరువుల వాడకం, వరినాటే సమయంలో మొక్కకు, మొక్కకు మధ్య నిర్దేశించిన దూరం అమలు చేయడం వంటి మెళకువలు పాటించడం ద్వారా శ్రీ వరిసాగులో అధిక దిగుబడులు సాధించొచ్చని వివరించారు. రైతు వ్యవసాయ ప్రయోజనాలకు అద్దంపడుతూ, శ్రీ వరిసాగుకు, ఎన్ఆర్ఐ పి-003-రవి రకం విత్తనం వినియోగించాలని, నేల చదునుగా ఉండాలన్నారు. పొలంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వరి నాట్ల విషయంలో ఒకమొక్క నాటాలని, మొక్కల మధ్య నిర్దేశించిన దూరం పాటించాలన్నారు.

# కాంగ్రెస్ సి పి ఐ పొత్తు ధర్మాన్ని పాటిద్దాం

## స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి శ్రేణులు సిద్ధం కండి

## సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

(హుస్నాబాద్ జనవాహిణి స్టాఫ్ రిపోర్టర్ చిట్యాలబాబు )

చిగురుమామిడి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయం ముస్కు రాజిరెడ్డి స్మారక భవన్ లో సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం లో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపి ని గద్దెదింపేం దుకు ఇండియా కూటమిలో పార్టీలన్నీ పనిచేయాలని, తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు మండల సహాయ కార్యదర్శి అందె చిన్న స్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంనకు ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ,ఎన్డీయే ప్రభుత్వం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తు దేశ సంపదను పెట్టుబడి దారులకు అప్పగించే కుట్రలు పన్నుతుందని ఆ దిశగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తుందని వాటిని నివారించాలంటే కేంద్రంలో బీజేపీని గద్దె దింపేందుకు దేశ వ్యాప్తంగా ఇండియా కూటమి ఏర్పడిందని,కూటమిలో ఉన్న సీపీఐ జాతీయ నాయకత్వం సూచనల మేరకు తెలంగాణ లో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో సీపీఐ,కాంగ్రెస్ కలిసి.పని చేసాయని,పొత్తు ధర్మాన్ని విస్మరించకుండా పూర్తి స్థాయిలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పనిచేశారని,సీపీఐ పార్టీ కాంగ్రెస్ కు సహకరించిందని కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు సీపీఐ తోడ్పాటు అందించిందని తెలిపారు ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ రక్షణ,తెలంగాణ రాష్ట్రంలో నీళ్లు,నిధులు,నియా మకాల ప్రాతిపదికన గత ప్రభుత్వం 10 సంవత్సరాలు పరిపాలించి రాష్ట్ర ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదని,రైతు బంధు,ధరణీ పోర్టల్ లాంటి వాటిలో లోపాలు ఉన్నాయని వాటిని పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన బాధ్యత నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉందని చాడ వెంకటరెడ్డి అన్నారు హుస్నాబాద్ నియోజకవర్గంలో సీపీఐ మద్ధతు తో కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే గా గెలుపొంది నాడు అని ఆయన కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను గుర్తించిన కాంగ్రెస్ అధిష్టానం మంత్రి పదవి కట్ట బెట్టిందని, హుస్నాబాద్ నియోజకవర్గానికి మంత్రి పదవి రావడం శుభ పరిణామమని మంత్రిగా ఎన్నికైన పొన్నం ప్రభాకర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో సర్పంచ్ లుగా,ఎంపీటీసీ లుగా,జడ్పీటీసీ



లుగా,ఎంపీపీ లుగా సీపీఐ అభ్యర్థుల పోటీ చేసేందుకు సిద్ధం కావాలని సీపీఐ శ్రేణులకు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, బోయిని అశోక్,మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సహాయ కార్యదర్శి అందె చిన్న స్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి, బూడిద సదాశివ,బోయిని పటేల్,ముద్రకోల రాజయ్య,సర్పంచ్ లు శ్రీమూర్తి రమేష్,గోలీ బాపురెడ్డి,ఆయా గ్రామాల సీపీఐ శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మొన్న కలెక్టర్... నిన్న ఎమ్మెల్యే స్పీకర్ ప్రసాద్ కుమార్

## అవే గ్యారెంటీ పథకాలను ప్రారంభోత్సవం అధికారులు ప్రోటోకాల్ పాటించారా... ఉల్లంఘించారా..

## గ్యారంటీ ప్రారంభోత్సవం పై ఆసక్తికర చర్చ

















వికారాబాద్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 10( జనవాహిని న్యూస్): ఒకరు ప్రజాప్రతినిధి... మరొకరు జిల్లాను శాసించే బాస్.. ఇద్దరు ఉన్నత స్థానం కలిగినవారే.. ఒకరు ప్రజాప్రతినిధి అయితే. మరొకరు ప్రభుత్వ ఉద్యోగి. వీరిద్దరూ ప్రజాస్వామ్యంలో భాగస్వాములు. ఇంతవరకు బాగానే ఉంది. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించే విషయంలో భాగస్వాములు అయ్యారా.. లేక ఎవరికి వారే ప్రభుత్వ పథకాలను ప్రజల మధ్యకు తీసుకు వెళుతున్నారా అన్నది ప్రశ్న. అందుకు ఉదాహరణగా తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన గ్యారెంటీ పథకాలను అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా ప్రభుత్వ పథకాలను ప్రజల మధ్యకు తీసుకువెళ్లారని చర్చ జరుగుతుంది అందుకు మొదటి జిల్లా కలెక్టర్ రోజు ప్రారంభించిన రెండు పథకాలను ఉదాహరణంగా పేర్కొనవచ్చు... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 6 గ్యారంటీ పథకాలా అమల్లో భాగంగా రెండు పథకాలను వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి జిల్లా అధికార యంత్రాంగం తో కలిసి ప్రారంభించారు. అందులో మహాలక్ష్మి పథకం చేయూత పథకాన్ని ప్రజల మధ్యకు తీసుకువెళ్లి గోడ పత్రాలను జిల్లా అధికారులు కొందరు స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం చేసే అవకాశం దక్కింది అంతేకాకుండా చేయిత పథకం ద్వారా ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం కోసం 15 లక్షల వరకు వైద్యం కోసం ఖర్చు చేసే వెసులుబాటు పథకాన్ని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ప్రారంభించారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేయగానే రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేయడానికి మొన్న ప్రమాణ స్వీకారం అనంతరం ప్రారంభోత్సవం చేశారు ఇంతవరకు బాగానే ఉంది కానీ జిల్లా స్థాయి వరకు వచ్చేసరికి ప్రోటోకాల్ ఉల్లంఘన విషయం తెరపైకి వచ్చింది వికారాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గడ్డం ప్రసాద్ కుమార్ గెలుపొందారు అనంతరం మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఆయన తెలంగాణ శాసనసభ పతిగా నియమితులయ్యారు ఆయనకు ఉన్నత పదవులు దక్కాయి. వారి హాయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాల ప్రారంభోత్సవానికి ఆయనకు ఆహ్వానం అందలేదన్నట్లు తెలుస్తుంది ఈ విషయమై వికారాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి అధికారులపై మండిపడ్డారు ప్రజాప్రతినిధులకు ఆహ్వానం లేకుండా ప్రభుత్వ పథకాలు ఎలా ప్రారంభిస్తారని జిల్లా అధికార యంత్రంపై మున్సిపల్ అధికారులపై మండిపడ్డారు జిల్లాలో ప్రజాప్రతినిధులు ఉండగా అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా దాన్ని ఉల్లంఘించి ప్రభుత్వ పథకాలను ప్రారంభోత్సవం చేయడం ఏమిటని ప్రశ్నించారు దీంతో అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘించి ప్రభుత్వ పథకాలను ప్రారంభోత్సవం చేశారని వివాదం తెరపైకి వచ్చింది వికారాబాద్ నూతన ఎమ్మెల్యే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు సమాచారం ఇవ్వకుండా ప్రారంభోత్సవాలు ఏమిటని ప్రజాప్రతినిధులు అధికారుల నిలదీశారు దీంతో అధికారులు జరిగిన తప్పును గమనించి తిరిగి రెండోసారి అవే పథకాలను వికారాబాద్ ఎమ్మెల్యే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో రెండోసారి ఆదివారం ప్రారంభోత్సవం చేశారు వాటిలో మహాలక్ష్మి చేయూత పథకాలను ప్రారంభోత్సవం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో భాగంగా రెండు పథకాలను తక్షణమే అమలు చేస్తూ మిగతా పథకాలను 90 రోజుల్లో ప్రారంభిస్తామని చేస్తామని చెప్పుకొచ్చారు అధికారుల ప్రోటోకాల్ ఉల్లంఘన కారణంగానే ప్రభుత్వ పథకాలను తొలి రోజున మరుసటి రోజున రెండు పథకాలను ప్రారంభించి ప్రజల మధ్య చర్చకు తెర లేపారు అధికారులు ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయ లోపం ఏర్పడితే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు క్షేత్రస్థాయిలో ఎలా అందుతాయని ప్రజల మధ్య చర్చ జరుగుతుంది అధికారులు ఉద్దేశపూర్వకంగానే ప్రోటోకాల్ ఉల్లంఘించారా... లేక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం అనంతరం ప్రభుత్వ పథకాలను ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు అందడంతో అధికారులు హడావుడిగా అదే రోజు గ్యారంటీ పథకాలను ప్రారంభించారా అనే చర్చ జరుగుతుంది రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనంతరం మిగతావారు ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేయని కారణంగా ప్రభుత్వ పథకాలు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు వికారాబాద్ ఎమ్మెల్యే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆహ్వానం పంపనట్లు తెలుస్తుంది ఏది ఏమైనా నూతన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీ పథకాల్లో భాగంగా రెండు పథకాలను అధికారులు ప్రజా ప్రతినిధులు కలిసి రెండుసార్లు ప్రారంభోత్సవం చేయడం విశేషం....!



# నంద్యాలలో రెచ్చిపోతున్న మట్కా మాఫియా, బెట్టింగ్ మాఫియా





నంద్యాల ప్రతినిధి. డిసెంబర్ 10. జనవాహిని న్యూస్.
కొన్ని ప్రధాన కూడళ్లు జగజ్జనని నగర్, నూనెపల్లె ఫ్లైఓవర్ మరియు చాంద్బాడా ప్రాంతాలను అడ్డగా చేసుకొని ఈ దందాను కొనసాగిస్తున్నారు కొంతమంది మాఫియా గాళ్లు గతంలో ఎన్ని మార్లు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చిన వీరి తీరు మారడం లేదు, ఏముందిలే కొంతకాలం జైలు జీవనం కొనసాగించి మళ్లీ బయటకు వస్తాము అనే ధైర్యంతోనే వీరి దందాను కొనసాగిస్తున్నారు. పేదలు కష్టపడిన సొమ్ము వీరికి ప్రధాన ధనార్జన ధ్యేయంగా కనిపిస్తోంది బెట్టింగ్ మాఫియా గాళ్లు కేవలం ఇండియా మ్యాచ్ లే కాకుండా బెట్టింగ్లే ప్రధాన ధ్యేయంగా ఏ దేశాలు ఆడినా కూడా వారి మీద బెట్టింగ్ కట్టి ధనార్జన చేసుకుంటున్నారు. ఈ తతంగమంతా మొబైల్ ఫోన్లలోనే జరుగుతుంది. కాబట్టి వీరి అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది మట్కా అయినా బెట్టింగ్ అయిన మొబైల్ ఫోన్ల ద్వారానే ఈతంగమంతా కొనసాగిస్తున్నారు మాఫియా గాళ్లు, పోలీసులంటే భయం లేదు, మీడియాలు అంటే భయం లేదు, కేవలం ధనార్జనే దేయంగా పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నారు. బెట్టింగ్ మాఫియా గాళ్లు కొంతమంది చోటా గల్లీ రాజకీయ నాయకులు సైతం ఇందులో ఇన్వాల్వ్ అయి ఉన్నారు అన్న వాదనలు కూడా లేకుండా పోలేదు.

# సుప్రీం తీర్పు సంతృప్తికరంగా లేదు

## 370 ఆర్టికల్‌పై గులాంనబీ ఆజాద్

శ్రీనగర్,డిసెంబర్11: ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు తీర్పు విచారకరంగా ఉందని, దురదృష్టకరమని డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ ఛైర్మన్ గులాం నబీ ఆజాద్ అన్నారు. కోర్టు తీర్పుతో ప్రజలు సంతోషంగా లేరని పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్ లో ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన తరుణంలో అక్కడ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ధర్మాసనం ఈసీని ఆదేశించింది. కశ్మీర్ రాష్ట్ర హోదాను త్వరగా పునరుద్ధరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించింది. 2024 సెప్టెంబర్ 30కల్లా ఎన్నికలు పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ కూటమిగా జమ్ము-కశ్మీర్ పార్టీలు ఏర్పడ్డాయి. గుప్కార్ అలయన్స్ పేరుతో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పిటిషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ ఏడాది ఆగస్ట్ 2 నుంచి ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ జరిపింది. 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు చేస్తూ పార్లమెంట్ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన పలు జమ్ము-కాశ్మీర్ రాజకీయ పార్టీలు సుప్రీంను ఆశ్రయించాయి. ఈ ఆర్టికల్ 370 రద్దు కేసు విచారణలో భాగంగా రాజ్యాంగ ధర్మాసనంలో ఉన్న ఐదుగురు జడ్జిలు 3 రకాలు తీర్పులు వెల్లడించారు. దీంతో రాజ్యాంగ ధర్మాసనంలోనే భిన్నమైన తీర్పులు వెల్లడయ్యాయి. ఈ సందర్భంగా ఆర్టికల్ 370 రద్దుపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. కశ్మీర్‌కు ప్రత్యేక సార్వభౌమాధికారం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగం అయినపుడు ప్రత్యేక హోదాలేమీ లేవని పేర్కొంది. జమ్మూ కాశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక రాజ్యాంగం కేవలం కేవలం రాజ్యాంగ వెసులుబాటుకోసమేనని వెల్లడించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 2019 ఆగస్టులో లడఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా విభజించాలనే నిర్ణయాన్ని సమర్థించింది. తీర్పు నేపథ్యంలో అక్కడ భద్రతను కట్టుదిట్టం చేశారు. కోర్టు నిర్ణయాన్ని గౌరవించాలని బీజేపీ కోరింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోమని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా తెలిపారు.

# తెలంగాణలో వ్యవసాయ ఉత్పత్తులు పెరగాలి

## – లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగాలి

## –అధికారులకు మంత్రి తుమ్మల సూచన

హైదరాబాద్,డిసెంబర్11

తెలంగాణలో వ్యవసాయ ఉత్పత్తులు పెంచేలా కృషి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వ్యవస్థలో, శాఖాపరంగా ఉన్న లోపాలను సవరించుకొని రైతులకు సంక్షేమానికి అధికారగణం పాటుపడాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని అధిక పంట దిగుబడిని సాధించడమే కాకుండా, ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం విశేషంగా కృషి చేయాలన్నారు. తద్వారా రైతులకు మంచి మద్దతు ధర లభించేలా మార్కెటింగ్ శాఖా అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. అన్ని రకాల పంటలకు తెలంగాణ నేల అనుకూలంగా ఉంటుంది. బహుశా దేశంలో ఏ రాష్ట్రానికి ఈ ప్రత్యేకత లేదని, సీజన్ల వారిగా ముందుగానే శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని, అందుకు తగ్గట్టుగా రైతులను వ్యవసాయానికి సమాయత్తం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరవాత సచివాలయంలోని వ్యవసాయ శాఖ సెక్రటరీ ఛాంబర్లో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మంత్రికి సెక్రటరీ రఘునందన్ రావు, హెచ్ఓడీ, ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి ఉత్పత్తి పెంచి వ్యవసాయశాఖకు మంచి పేరు తేవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తరకం పంటలను రైతులకు పరిచయం చేయాలి. మామిడి, జామ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఆ పంటల సాగుకు సహాయపడాలి. పాం ఆయిల్ పంట సాగు చేసే రైతులు మంచి దిగుబడి సాధిస్తున్నారు. వాళ్లకు మంచి గిట్టుబాటు ధర లభిస్తున్నది. ఆ సాగును మరింత ప్రోత్సహించాలని, అందులో అంతర పంటగా పుచ్చకాయలుపండించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు.

# బుగ్గన చేసిన అభివృద్ధిని ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియా సైనికులు పనిచేయాలి

## సోషల్ మీడియా ఆత్మీయ సమావేశంలో బుగ్గన అర్జున్ రెడ్డి



డోన్ ):పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్ లో సోమవారం డోన్ నియోజకవర్గ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బుగ్గన అర్జున్‌రెడ్డిహాజరయ్యారు.బుగ్గనఅర్జున్ రెడ్డి మాట్లాడు తూ..... ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా చేసిన అభివృద్ధిని ప్రజలందరికీ తెలిసేలా సోషల్ మీడియా సైనికులు కృషి చేయాలని బుగ్గన అర్జున్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇప్పటి వరకూ నడిచిన ప్రతి ఒక్కరికీ కృతజతలు తెలిపారు. మరోసారి మంత్రి బుగ్గన గెలుపు దిశగా కలిసి అడుగేసి ఆయనకు హ్యాట్రిక్ అందించి మరింత అభివృద్ధిని కొనసాగించాలన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయ వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్న పథకాలు దేశంలో ఎక్కడా లేవని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం గా డోన్ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ఆర్థిక మంత్రి బుగ్గన అహర్నిశలు పనిచేస్తున్నారని వారు ఈ సందర్భంగా తెలియజేశారు.రూ .350 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు, రూ.224 కోట్లతో హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా ప్యాపిలి, డోన్ మండలాల పరిధిలోని 36 చెరువులకు నీరు నింపడం, పుణ్యక్షేత్రాలు, పర్యాటక అభివృద్ధి, పాలిటెక్నిక్, ఐ.టీ.ఐ, బీసీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలు, ఎమ్ఎస్ఎంఈ సెంటర్, వెటర్నరీ షెపర్డ్ సెంటర్, ఐటీడీఆర్, 100 పడకల ఆస్పత్రి ఇలా వందలాది ప్రాజెక్టుల కోసం రూ.2,500 కోట్లు ఖర్చు పెట్టిన విషయాన్ని ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియా కీలక



పాత్ర పోషించాలన్నారు.ఈ సందర్భంగా ఐ ప్యాక్ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణపై అవగాహన కలిగించేలా ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, డోన్ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్, వార్డు కౌన్సిలర్ దినేష్ గౌడ్, నంద్యాల జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్, డోన్ మండల అధ్యక్షుడు మల్లంపల్లి రామచంద్రుడు, డోన్ పట్టణ అధ్యక్షుడు కురుకుంద హరి, బేతంచెర్ల, డోన్, ప్యాపిలి మండలానికి చెందిన సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు, సచివాలయానికి ఇద్దరు చొప్పున ఎంపిక చేసిన సోషల్ మీడియా సభ్యులు 200 మందికి పైగా హాజరయ్యారు.

# ఉద్యోగస్తులకు జీతాలు కూడా ఇవ్వలేని రాష్ట్రంగా మార్చిన వైసిపి ప్రభుత్వం

-ఉపాధ్యాయులకు జీతాలు లేక ఆత్మహత్యయత్నాలు చేసుకుంటున్నారు.

-డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి.



ప్యాపిలి పట్టణంలోని 9వ వార్డు నందు బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం ప్యాపిలి పట్టణ టిడిపి అధ్యక్షులు భూశెట్టి చిన్న సుంకయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి, డోన్ నియోజకవర్గ టిడిపి అబ్జర్వర్ కమతం కాటమయ్య, మాజీ ఎంపిపి ఆర్.ఈ.రాఘవేంద్ర హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వఉద్యోగస్తులకు నెలకు జీతాలు సారిగా ఇవ్వకపోవడంతో, ఒక ఉపాధ్యాయుడు నా చావుకి కారణం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నంచాడన్ని దీన్ని బట్టి చూస్తే వైసీపీ ప్రభుత్వ పాలన ఎంత చెత్తగా సాగిస్తుందో అర్థమౌతుందని అన్నారు. ఉపాధ్యాయులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి తెచ్చిన తొలి ఘనత ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ గారికే దక్కిందని . గత తెలుగుదేశంపార్టీ ప్రభుత్వంలో రాష్ట్ర విభజన తరువాత రాష్ట్రం ఎన్ని ఇబ్బందులు ఉన్నా, నారా చంద్రబాబు నాయుడు ఉద్యోగస్తులకు జీతాలు సరైన సమయంలో ఇచ్చేవారని, రాష్ట్ర ప్రజలు ఈ జగన్మోహన్ రెడ్డిని గద్దె దింపేందుకు సిద్దంగా ఉన్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో డోన్ నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ జెండాను తప్పుక ఎగురవేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్యాపిలి మండలం టిడిపి అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఖాజా పీరా,బీసీ కమిటీ నాయకులు నాగేంద్ర,ప్యాపిలి మండలం ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ప్రిన్సిపాల్ మధు, చల్లా వీరా, మల్లి, రాజు,బాల్ రెడ్డి, బ్యాంకు శ్రీను, మధు,డిష్ శ్రీను, మద్దన్న, శ్రీనివాసులు, సూరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు నాటకానికి పండగగా? నంది నాటకోత్సవాలు

23 నుంచి 29 వరకు వారం రోజుల పాటు ప్రదర్శనలు

చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి

విజయవాడ,డిసెంబర్11:తెలుగు నాటకానికి పండుగ రోజైన నంది నాటకోత్సవాలను డిసెంబర్ 23 నుంచి 29 వరకు వారం రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర టి. వి,నాటక రంగ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పోసాని కృష్ణమురళి తెలిపారు. సోమవారం విజయవాడలో నంది అవార్డుల తుది పోటీల న్యాయనిర్ణేతల సమక్షంలో 22వ నంది నాటకోత్సవం -2022కు సంబంధించిన వివరాలను పోసాని కృష్ణమురళి మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా పోసాని మాట్లాడుతూ గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నందినాటకోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఈ ప్రాంగణానికి సత్య హరిశ్చంద్ర నాటక రచయిత బలిజేపల్లి లక్ష్మీకాంతం పేరును నామకరణం చేసినట్లు చెప్పారు. నంది నాటకోత్సవాల్లో భాగంగా 115 ప్రదర్శనలకు గానూ రాష్ట్రం నలుమూలల నుండి పద్య, సాంఘిక నాటకాలు, సాంఘిక నాటికలు, బాలల నాటిక, కళాశాల లేదా యూనివర్సిటీ నాటిక అనే ఐదు విభాగాల్లో ఎంపిక చేసిన 38 నాటక సమాజాలు ఈ పోటీల్లో పాల్గొంటున్నా యన్నారు. ఆయా విభాగాల్లో కలిపి మొత్తం 74 అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. పూర్తి పారదర్శకంగా నంది అవార్డుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశించినట్లు పోసాని కృష్ణమురళి స్పష్టం చేశారు. తెలుగు నాటక రంగం దేదీప్యమానంగా వెలగాలని, రంగ స్థలానికి పునర్వైభవం తీసుకురావాలన్న సత్సంకల్పంతో నంది నాటకోత్సవాలను ప్రతిష్టాత్మకంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సంకల్పించిందని పోసాని కృష్ణమురళి తెలిపారు. ఎంట్రీల ప్రాథమిక ఎంపిక ఈ ఏడాది సెప్టెంబర్ 6-18 మధ్య జరిగిందని, ఫలితాలను సంస్థ 19న వెల్లడించిందని పేర్కొన్నారు. మూడు న్యాయనిర్ణేతల బృందాలు పోటీల్లో పాల్గొనడానికి ముందుకు వచ్చిన నాటక సమాజాల వద్దకు వెళ్లి వాళ్ల ప్రదర్శనలు తిలకించి ఎంపిక చేశాయన్నారు. వీటిలో పద్యనాటకాలలో 26కు గాను 10, సాంఘిక నాటకాలలో 22 కు గాను 6, సాంఘిక నాటికలలో 49 కు గాను 12, కాలేజీ యూనివర్సిటీ స్థాయిలో 9 కు గాను 5, బాలల విభాగాలలో 9 కు గాను 5 ఎంపిక చేయడం జరిగిందని వివరించారు. వారం రోజుల పోటీల్లో తుది ఎంపిక కోసం సంబంధిత సమాజాలు సంస్థ చైర్మన్ సమక్షంలో జరిగిన'లాటరీ'లో పాల్గొన్న అనంతరం ప్రదర్శనల 'షెడ్యూలు'ను సంస్థ ఖరారు చేసిందన్నారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుండి రాత్రి 10 గంటల వరకు నాటక ప్రదర్శనలు జరుగుతాయని పోసాని తెలిపారు. 5 విభాగాలలో స్వర్ణ, రజత, కాంస్య నంది బహుమతుల కోసం జరిగే పోటీల్లో ఒక్కోదానిలో ముగ్గురు చొప్పున మొత్తం 15 మంది న్యాయనిర్ణేతలు ఈ తుది ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేస్తారని పోసాని తెలిపారు. అవార్డులు ప్రదానం చేస్తున్న ఏడాదిలో (2022) నాటక రంగంపై వెలువడిన ఉత్తమ రచన గ్రంథం ఎంపిక కోసం మరో ముగ్గురితో మరో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని పోసాని కృష్ణ మురళి తెలిపారు. 18 మంది ఉత్తమ నిపుణులు, కళాకారులను జడ్జిలుగా ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. న్యాయ నిర్ణేతల ఎంపికలో లోపాలను ఎత్తిచూపిస్తే వారిని కూడా మారుస్తామని పోసాని తెలిపారు. ప్రభుత్వం 1998 నుంచి నంది నాటకోత్సవాల వేదికపై 'ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం' పేరుతో నాటకరంగంలో వ్యక్తిగత స్థాయిలో విశేష కృషి చేసిన నటులకు, కళాకారులకు రూ.1,50,000 నగదు ప్రదానం చేస్తోందని పోసాని కృష్ణ మురళి తెలిపారు. ప్రస్తుతం మొదటిసారి ఈ రంగంలో సమిష్టి కృషితో పనిచేసిన సమాజాలకు, పరిషత్తులకు ఈ అవార్డుతో గుర్తింపు లభించనుందని వెల్లడించారు. నాటక రంగంపై ఆసక్తిగల కళాప్రియులకు వేదిక కల్పించి, ఆ రంగం వృద్ధికి గణనీయమైన కృషి చేసిన నాటక సమాజాలు, పరిషత్తులకు రూ.5,00,000 నగదు, 'వైఎస్సార్' ప్రతిమ మొమెంటోతో సత్కరిస్తూ నాటక సమాజాలకు ప్రభుత్వం అరుదైన గౌరవం కల్పించనుందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసిందని పేర్కొన్నారు. 'ఎన్టీఆర్', 'డా. వై.ఎస్.ఆర్'. అవార్డుల ఎంట్రీలకు తుది గడువు డిసెంబర్ 20 వరకు పొడిగించిన నేపథ్యంలో ఇంకా ఎవరైనా కళాకారులు దరఖాస్తు చేసుకోకపోతే ఎఫ్ డీసీకి మెయిల్ ద్వారా సంబంధిత గడువులోగా దరఖాస్తులు పంపాలన్నారు. బాలల, కళాశాల విద్యార్థి నాటకాల విభాగాల్లో వ్యక్తిగత బహుమతులను వచ్చే సంవత్సరం నుండి అందించే అంశాన్ని సంస్థ పరిశీలిస్తుందని పోసాని కృష్ణమురళి తెలిపారు.

ఈ సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఆదరణ తగ్గుతున్న నాటక రంగానికి పూర్వ వైభవం లభిస్తుందన్న కళాభిలాషుల ఆకాంక్ష నెరవేరనుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో నాటక రంగంలోకి కొత్తగా యువతరం ప్రవేశించే అవకాశం మెండుగా ఉందన్నారు. పూర్తి పారదర్శకంగా అవార్డుల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నామని, అవార్డుల ఎంపికకు అనుభవజ్ఞులైన ప్రముఖ నాటక రంగం వ్యక్తులతో వివిధ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. స్థానిక కళాకారులు, అధికారులతో నిర్వహణ కమిటీ, ఆహ్వాన కమిటీ, స్టేజీ కమిటీ, ఆడిటోరియం కమిటీ, ఆతిథ్య కమిటీ, వసతి సదుపాయాలు మరియు రవాణా కమిటీ, ప్రెస్ సమన్వయ కమిటీ తదితర కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. మీడియా సమావేశంలో రాష్ట్ర చలనచిత్ర, టీవీ, థియేటర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఎంవీఎల్ఎన్ శేషసాయి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.2.5 కోట్లతో తీర్చిదిద్దుతున్న బిలసర్గం గుహల నిర్మాణ పనులు ఆర్థిక మంత్రి బుగ్గన పరిశీలన



బేతంచర్ల మండల పరిధిలోని కనుమకింద కొట్టాలలో ఉన్న బిల్లసర్గం గుహల సమీపంలో వేగంగా సాగుతున్న అభివృద్ధి పనులను ఆర్థిక శాఖ బుగ్గన రాజేంద్రనాథ్ పరిశీలించారు. రూ.2.5 కోట్లతో తీర్చిదిద్దుతున్న పర్యాటక అభివృద్ధి పనులు, రహదారి నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. జనవరి నెలాఖరు కల్లా ప్రారంభోత్సవం నేపథ్యంలో పనులను మరింత వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. గుహల సమీపంలో ఏర్పాటవుతున్న రెస్టారెంట్ పనులను పరిశీలించారు. ఇప్పటికే గుహలను సందర్శించే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పర్యాటక కేంద్రానికి అవసరమైన సదుపాయాలను సమకూర్చనున్నట్లు మంత్రి ఉద్యోగస్తులకు జీతాలు కూడా ఇవ్వలేని రాష్ట్రంగా మార్చిన వైసిపి ప్రభుత్వం.

# ప్రస్తుతానికి యధావిధిగా రైతుబంధు

తోణమే నిధుల విడుదలకు సిఎం ఆదేశాలు

పాతపద్ధతిలోనే నిధుల చెల్లింపునకు చర్యలు

సిఎం రేవంత్ ఆదేశాలతో కదిలిన అధికారులు

హైదరాబాద్,డిసెంబర్11): తెలంగాణ ప్రభుత్వం రైతులకు శుభవార్త అందించింది. రైతులకు పెట్టుబడి సాయం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వెంటనే చెల్లింపులు ప్రారంభించాలని సూచించారు. ఇప్పటికే ట్రెజరీలో ఉన్న నిధులను విడుదల చేయాలని సీఎం స్పష్టం చేశారు. గతంలో మాదిరిగా రైతులకు ఈ చెల్లింపులు చేయాలని అధికారులను కోరారు. అయితే కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన రైతు భరోసా పథకానికి ఇంకా విధి విధానాలు ఖరారు కాకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతానికి గతంలో ఉన్న రైతుబంధు పథకం లబ్దిదారులకు పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించారు. సమీక్ష సందర్భంగా రైతుబంధు చెల్లింపులపై వివరాలను ఆరా తీసారు. కాగా తెలంగాణ ఎన్నికలకు ముందే రైతుబంధు సాయం రైతులకు అందాల్సి ఉంది. కానీ అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రైతుబంధు పథకం అమలును ఈసీ నిలిపివేసింది. తర్వాత అనుమతి ఇచ్చినప్పటికీ బీఆర్ఎస్ నేతలు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి చేసిన కామెంట్ల కారణంగా ఈసీ రైతుబంధును నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు సాయం అందిస్తామని రేవంత్‌రెడ్డి మాట ఇవ్వడంతో తాజాగా ఆయన ఆదేశాలు జారీ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిఎం ఆదేశాలతో ఇక రైతులకు పంట పెట్టుబడి సాయం చెల్లింపులు ప్రారంభం కానున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఏటా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.10వేలు అందించిన సంగతి తెలిసిందే. రెండు విడుతల్లో ఆర్థిక సాయాన్ని అందిస్తుండగా.. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రబీ సీజన్‌కు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో సాయాన్ని జమ చేయలేకపోయింది. ట్రెజరీలో జమ చేసిన నిధులను ఇప్పుడు విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# కుప్పానికి ఏనుగుల ప్రమాదం

గుంపులుగా తరలివస్తున్న ఏనుగుల మంద

ఆందోళనలో స్థానిక రైతాంగం

చిత్తూరు,డిసెంబర్11 చిత్తూరు జిల్లా కుప్పానికి ఏనుగుల ప్రమాదం పొంచి ఉంది. తమిళనాడు రాష్ట్రం హోసూర్ నుంచి కుప్పం వైపు 70 ఏనుగుల గుంపు తరలివస్తున్నట్లుగా గుర్తించారు. రాత్రి తమిళనాడు హోసూరు సరిహద్దులో 70 ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. కుప్పం సరిహద్దు గ్రామాల్లో అటవీశాఖ అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. గ్రామ సరిహద్దుల్లో, పొలాల్లో రాత్రి పూట ప్రజలు ఉండకూడదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కుప్పం అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. చిత్తూరు జిల్లాలో ఏనుగులు గుంపు స్థైర విహారం చేస్తోంది. గత నెల రోజుల నుంచి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తూ పంటలు నాశనం చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఫారెస్టు ఆఫీసర్లు పట్టించుకోవడం లేదనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. రైతులు కూడా అదే అభిప్రాయంతో ఉన్నారు. లక్షల్లో పంటలు ధ్వంసం చేస్తున్నా ఏనుగుల గుంపును తరిమే ప్రక్రియ చేపట్టలేదంటున్నారు. దీంతో అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు.వికోట మండలంలో 13 ఏనుగుల గుంపు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం పంటలను ధ్వంసం చేశాయి. కృష్ణాపురం, మోట్లపల్లి, జవునిపల్లి, మిట్టూరు తదితర గ్రామాల సమీప పంటపొలాల్లోకి ప్రవేశించి నాశనం చేస్తున్నాయి. కూరగాయల పంటలను ధ్వంసం చేస్తున్నారు. తొక్కి పడేస్తున్నాయి. ఏనుగుల బారి నుంచి తమ పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటు న్నారు. మరోవైపు కుప్పం వైపుగా ఏనుగుల గుంపు బయల్దేరింది. 70 ఏనుగుల గుంపు అటుగా వస్తోందని సమాచారం తెలుసుకున్న కుప్పం ప్రజలు ఆందోళనకు గురి అవుతున్నారు. రాత్రి కర్ణాటక సరిహద్దులో ఈ గుంపు హల్ చల్ చేసింది. అటు కర్ణాటక పోలీసులు కూడా హై అలర్ట్ అయ్యారు. సోలార్ ఎస్పీ ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. గ్రామ సరిహద్దుల్లోని పొలాల్లో రాత్రి పూట ప్రజలు ఉండని అధికారులు సూచిస్తున్నారు. రాత్రిపూట బయటకు రావద్దని కూడా హెచ్చరిస్తున్నారు. ఏనుగుల గుంపు వస్తుందని తెలుసుకున్న కుప్పం అటవీ శాఖ అధికారులు అనిమల్ ట్రాకర్స్‌తో గస్తీ కాస్తున్నారు.

# టీర్ మల్లేశ్‌కు మాజీమంత్రి సునీత అండ

అనంతపురం,డిసెంబర్11 ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు మల్లేష్‌కు మాజీ మంత్రి పరిటాల సునీత ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం ఉదయం మాజీ మంత్రులు పరిటాల సునీత , ప్లలెరఘునాథ్ రెడ్డి ప్రభుత్వాస్పత్రికి వెళ్లి టీచర్ మల్లేష్‌ను పరామర్శించారు. ఉపాధ్యాయుడు మల్లేష్ కుటుంబ సభ్యులకు సునీత ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మల్లేష్‌కు పరిటాల సునీత రూ.50వేల ఆర్థిక సాయం ప్రకటించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ.. వారంలోగా సీపీఎస్ రద్దు చేస్తానన్నారు ఏమైందని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు భయపడి ఎన్నికల విధులకు కూడా దూరం చేస్తున్నారన్నారు.

# సంపాదకీయం

## 370 రద్దుపై సుప్రీం తీర్పుతో బలం

కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దును సుప్రీం సమర్థించడం ఓ చారిత్రాత్మక తీర్పుగా గుర్తించాలి. పార్లమెంట్ నిర్ణయాన్ని వ్యతిరేకించలేదమని, ఇది దేశ ప్రయోజనాలకు సంబంధించిన వ్యవహారంగా సుప్రీం భావించింది. సుప్రీం చీఫ్ జస్టిస్ వైవి చంద్రచూడ్ నేతృత్వంతోని ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది. ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రం రద్దు చేయడంపై జోక్యం చేసుకోలేమని తెలిపింది. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఆర్టికల్ 370 రద్దుపై పార్లమెంట్ నిర్ణయాన్ని కొట్టి పారేయలేమని జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. ఇది రాజ్యాంగబద్ద నిర్ణయమేనని ప్రకటించింది. ఈ క్రమంలో దీనిపై కేసులు వేసినవారు, అధికారంలోకి వస్తే మళ్లీ 370 ఆర్టికల్ తెస్తామన్న వాళ్లు కళ్లు తెరవాలి. దేశంలో ఓ ప్రాంతాన్ని వేరుగా చూపడం ద్వారా ఇన్నాళ్లూ ముఫ్తీలు, అబ్దుల్లాలు కాశ్మీర్ సంపదను దోచుకున్నారు. లక్షలమంది హిందువులను ఊచకోత కోసినా కిమ్మనకుండా ఉన్నారు. హిందువులను మతమార్పిళ్లతో హింసించారు. ఉగ్రవాదులను ప్రోత్సహించారు. చరిత్రను మరచిన నేతల కారణంగా కాశ్మీర్ రావణకాష్టంగా రగిలింది. ప్రత్యేక ముసుగులో జరగరాని అకృత్యాలన్నీ జరిగాయి. ఈ క్రమంలో అక్కడ ఆర్టికల్ 370ని ఎత్తివేస్తూ...పార్లమెంట్ నిర్ణయం తీసుకుంది. దీనిని వ్యతిరేకిస్తూ సుప్రీంలో కేసులు వేసారు. తాజాగా సుప్రీం దర్మాసనం తీర్పుతో కాశ్మీర్ నేతలు కళ్లు తెరవాలి. ఇకపోతే ఆక్రమిత కాశ్మీర్ విషయంలో నెహ్రూతో పాటు ఆ తరవాత వచ్చిన ప్రభుత్వాలన్న



తప్పులమీద తప్పులు చేశాయి. పాక్‌తో యుద్ద సమయంలో ఆక్రమిత కాశ్మీర్ అంశాన్ని ప్రాస్తావించి ఉంటే పరిస్థితి మరోటా ఉండేది. ఇటీవలే పార్లమెంటులో హోంమంత్రి అమిత్ షా ఆక్రమిత కాశ్మీర్‌పై కీలక ప్రకటన చేశారు. అది ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని అన్నారు. ఇప్పటికే ఆలస్యం జరిగిందన్నారు. ఇకదీనిపై చర్యలకు పూనుకోవాల్సి ఉంది. మరోవైపు ఆర్టికల్ 370 ఎత్తేశాక కాశ్మీర్‌లో పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో కాశ్మీర్ విషయంలో ఇక తేలాల్సింది పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య మాత్రమే. దీనిని అంతర్జాతయ సమస్యను చేయడం ద్వారా పాక్ పీచమణచాలి. కాశ్మీర్‌పై నానాయాగీ చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటూ భారత్‌ను చికాకు పెట్టే పాక్ కుతంత్రాలకు దీటుగా జవాబివ్వాలి. పాక్ ఆక్రమిత కాశ్మీరీలు కూడా అక్కడ అణచివేతకు పోరాడుతున్నారు. తమను భారత్ కాశ్మీర్‌లో కలపాలని ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. 370 ఆర్టికల్ రద్దు తరవాత పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజలు స్వచ్ఛందగా అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగాగళం విప్పారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే కాశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులకు కృషి చేస్తూనే ఆక్రమిత కాశ్మీర్ స్వాధీనానికి అడుగులు వేయాలి. అలాగే దేశం యావత్తూ కేంద్రం తీసుకుంటున్న చర్యలు స్వాగతించాలి. నిజానికి తమ అజెండా ఇక పాక్ ఆక్రమిత కాశ్మీర్ అని అమిత్ షా చెప్పడం ద్వారా సమస్యపై పాక్‌కు సవాల్ విసిరారు. ఇంతకాలం కాశ్మీర్ సమస్యను అడ్డుగా పెట్టి అరాచకం చేస్తున్న పాక్‌కు కనువిప్పు కావాలి. అలాగే ఇక్కడి ఉప్పు తింటూ పాక్ పాడుతున్న ముఫ్తీలు, అబ్దుల్లాలను రాజకీయంగా ఏకాకి చేయాలి. దేశంలో వారికి స్థానం లేకుండా చేయాలి. ఉగ్రవాదాన్ని ఎగదోయడాన్ని ఆపనంతకాలం పాకిస్థాన్‌తో చర్చలు అసాధ్యమని భారత్ పదేపదే స్పష్టం చేస్తూనే...పాక్ కుతంత్రాలను ప్రపంచానికి తెలియచేస్తున్నారు. ఒకవేళ పాక్‌తో చర్చలు జరపాల్సి వస్తే అవి పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)పైనే ఉంటాయని గతంలోనే కేంద్రరోణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా స్పష్టం చేశారు. ఇది కాక మరో అంశంపై సంప్రదింపులు ఉండబోవని కుండ బద్దలుకొట్టారు. ఉగ్రవాదం ద్వారా భారత్‌ను అస్థిరపరిచి విచ్ఛిన్నం చేయాలని పాక్ పన్నిన కుట్రలను ఇక ఎంతమాత్రం సహించరాదు. 370 రద్దు తర్వాత ఇప్పుడు ప్రజలు తమ జీవితకాలంలోనే పీవోకే భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారు. పాక్ అక్రమ కబ్జా నుంచి పీవోకేకి విముక్తి కల్పించి, భారత్‌లో అంతర్భాగంగా మార్చాలన్న సానుకూల ప్రయత్నాలను మొదలు పెట్టాలి. ఇదే క్రమంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజల అణచివేతపై పోరాడాలి. అలాగే మన కాశ్మీర్‌లో అశాంతి రాజేస్తున్న ఉగ్రమూకలను చీల్చి చెండాడాలి. 370 ఆర్టికల్ రద్దు చేశాక రాష్ట్రంలో సానుకూల దృక్పథంతో అభివృద్ధి జరుగుతోంది. అయితే అధికారంలోకి రాగానే దీన్ని పునరుద్దరిస్తామని కాంగ్రెస్ నిస్సిగ్గుగా ప్రకటించింది. ఇందుకు కొన్ని పార్టీలు వంతపాడాయి. ప్రజలు కూడా దీనిని అర్థం చేసుకుంటున్నారు. మొత్తంగా కశ్మీర్‌లో పరిస్థితులను చక్కదిద్దేందుకు గత కొన్నేళ్లుగా కేంద్రం తీసుకుంటున్న చర్యలు విఫలం అయ్యేలా స్థానిక నేతలు, పాక్ ప్రేరేపిత సంస్థలు పనిచేస్తూ వచ్చాయి. పాక్ ప్రత్యక్ష,పరోక్ష చర్యలతో కాశ్మీర్ శాంతిని అడ్డుకుంటోంది.

# కాశ్మీర్ రాజకీయాల్లో మార్పు రావాలి

- పండిట్లకు ఉద్యోగ,ఉపాధి కల్పించాలి
- రాజకీయ స్వార్థ ప్రయత్నాలు తిప్పికొట్టాలి
- పాక్ దుశ్చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

న్యూఢిల్లీ,డిసెంబర్11 ఆర్టికల్ 370పై సుప్రీం తీర్పుతో బిజెపిని అప్రతిష్టపాలు చేయడమే లక్ష్యంగా అక్కడి నేతలు ఇంతకాలం చేసిన రాజకీయ డ్రామాలకు తెరపడనుంది. మళ్లీ 370ని పునరుద్ద రిస్తామన్న వారిని రాజకీయంగా ఏకాకులను చేయాలి. కాశ్మీర్ రాజకీయాల్లో ముఫ్తీలకు, అబ్దుల్లాలకు సథానం లేకుండా చేయాలి. కేంద్రం తీసుకుంటున్న శాంతి చర్యలకు ఇంతకాలం మెహబూబా ముఫ్తీ కూడా గండికొట్టారు. పూర్తి పాక్ అనుకూల విధానాలను నరనరాన జీర్ణించుకున్న హురియత్ నేతలు కాశ్మీర్‌లో శాంతి స్థాపనకు కేంద్రం చేసిన యత్నాలను గండికొట్టారు.అక్కడ 370 ఆర్టికల్‌ను అడ్డం పెట్టుకుని ఇంతకాలం హురియత్ నేతలు పాక్‌తో కలసి దేశ విద్రోహ చర్యలకు పాల్పడుతూ వచ్చారు. ప్రజలను రెచ్చగొడుతూ యువతను పక్కదారి పట్టించారు. కాశ్మీర్ అంశలో హురియత్ నేతలతోనే పాక్ ఎల్లవేళలా చర్చిస్తున్నారు. ఇక 370 రద్దతో హురియత్ నేతలకు స్థానం లేకుండ ఆపోయింది. అలాగే అక్కడి నుంచి తరిమివేయబడ్డ వేలాది కాశ్మీర్ పండిట్లతో కూడా సమస్యలు చర్చించడం ద్వారా వారిలో ధైర్యం కల్పించాలి. తాజాగా కేంద్రం తీసుకుంటున్న నిర్ణయంతో కాశ్మీర్‌లో అసలు జరుగుతున్నదేమిటో ప్రపంచానికి తెలిసింది. నిజానికి పండింట్లను ముందుగా వారిని తమ స్వస్థలాలకు పంపి రక్షణ కల్పించాలి. హురియత్ నేతలు ఒక్కరే కాశ్మీర్ ప్రజలు కాదని గుర్తుంచుకోవాలి. కనీస మర్యాద, గౌరవం లేకుండా తామేదో ఇతర దేశస్థుల మాదిరిగా ఇంతకాలం హురియత్ నేతలు వ్యవ హరిస్తూ వచ్చారు. ఇంతకాలం వారి పెడధోరణికి నిదర్శనంగా గుర్తుంచుకోవాలి. అతివాద హురియత్ నాయకుడు సయ్యద్ అలీషా గిలానీ తదితరులు విచ్ఛిన్నకర ధోరణితో కాశ్మీర్‌లో మరింత ఆజ్యం పోస్తూ వచ్చారు. వారంతా కావాలని పాక్ కొమ్ముకాస్తూ భారత్‌లో వేర్పాటువాద కార్యకలాపాలకు మద్దతు పలికారు. వీరంతా తాము అనుకున్న రీతిలో కాశ్మీర్ నడవాలని అనుకున్నారు. పాక్ వీరికి భారత్ వ్యతిరేక ఉగ్రవాదాన్ని నూరి పోస్తోంది. 370 ఆర్టికల్ కాశ్మీర్ అభివృద్దికి అడ్డుగా నిలవడమే గాకుండా కాశ్మీరీ పండింట్లకు చోటులేకుండా చేసింది. దీనిరద్దుతో ఇప్పుడు పండిట్లు తమ స్వస్థలాలకు చేరుకునే అవకావం వచ్చింది. ముందు పండిట్లను కాశ్మీర్‌లో స్వేచ్ఛగా జీవించే చర్యలు తీసుకోవాలి. అలా చేస్తేనే కాశ్మీర్ అందరిదన్న భావన ఉంటుంది. కాశ్మీరీ పండిట్లను జాడ లేకుండా తరిమేసినా గత ప్రభుత్వాలు ఏనాడూ అక్కడ నివారణ చర్యలు తీసుకుని అక్కడి ప్రజలను భారత్‌తో మమేకం చేయలేకపోయింది. రాజకీయ పార్టీలు కూడా ఇలాంటి విషయాల్లో ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తూ వచ్చాయి.

ఎలాగో అక్కడ అధికార భాగస్వామ్యాన్ని సాధించిన బిజెపి కఠినంగా వ్యవహరించి సమస్యను పరిష్కరించడంలో చొరవ తీసుకున్న దానిని విఫలం చేశారు. పాక్ పాలకులతో స్నేహం పెంచుకోవడం ద్వారా తీవ్రవాద గ్రూపులు కాశ్మీర్‌ను నిత్యం కల్లోల క్షేత్రంగా రగిలిస్తూనే ఉన్నారు. అందువల్ల ముందుగా కాశ్మీర్ నుంచి తరిమివేయబడ్డ పండిట్లను ఇతర ప్రాంత ప్రజలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అలా చికిత్సకు శ్రీకారం చుట్టాలి. అప్పుడే మిగతా వర్గాల ప్రజలు కూడా విశ్వాసంలోకి తీసుకునే ప్రయత్నం చేయాలి. ఇందుకోసం కొంత కఠిన వైఖరినే కేంద్రం అవలంబించాలి. ఇక్కడ శాంతి కోసం చేసే ప్రతి ప్రయత్నాన్నీ ఇక్కడ తీవ్రవాదులు ఎగదోస్తూ చిచ్చు రేపుతున్నారు. రాజకీయ లబ్ధికి వీటిని ఉపయోగించుకుంటున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా వ్యూహాలు ఉండాలి. నరేంద్రమోదీ ప్రభుత్వం కాశ్మీర్ సమస్య, కాశ్మీర్ పట్ల వివేకవంతమైన వైఖరితో ముందుకు వెళ్లడం



స్వాగతించాలి. ప్రధాని మోడీ ప్రయత్నాలు ఫలించాలంటే ప్రతిపక్షం కూడా ఆయనకు బాసటగా ఉండాలి. అయితే పక్కలో బల్లెంలా ఉన్న పాక్ పాలకులు కాశ్మీర్‌లో ఆజ్యం పోస్తూ ఉగ్రవాదులను ఎగదోస్తున్నారు. భారత్‌లో అలజడి సృష్టించేందుకు పాక్ చేస్తున్న ప్రయత్నాలు ఈ నాటివి కాదు. భారత్ నుంచి విడివడ్డ నాటి నుంచి అంటే 1947 నుంచి కుట్రలు పన్నుతూనే ఉంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు సృష్టించి తీవ్రవాదులను దేశం దాటించాలని అక్కడి సైన్యం చూస్తోంది. సరిహద్దుల్లో తీవ్రవాదలును చొప్పించేందుకు సిద్దంగా ఉన్న పాక్ సైన్యం కాల్పుల ద్వారా తరచూ దృష్టి మరల్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

సరిహద్దులో పాకిస్థాన్ పదేపదే కాల్పులకు తెగబడుతున్న తీరు దాని కుత్సిత బుద్దికి నిదర్శనంగా చెప్పుకోవాలి. పాక్‌కు మాటలతో సమాధానం చెప్పలేమని గతానుభవాలను బట్టి తెలుసుకోవాలి. పాక్‌లో అంతర్గ సంక్షోభాలు వచ్చినప్పుడల్లా ఇలా భార్‌తపైకి దాడులకు దిగుతారు. పాకిస్తాన్ ప్రజలను రెచ్చగొట్టేందుకే కాశ్మీర్ విషయంలో ఎప్పుడూ వివాదం సృష్టిస్తూనే ఉంటారు. ఆక్రమిత కాశ్మీర్ ఇప్పటికీ ఈ సమస్య రాజుకుంటూనే ఉంది. దౌత్య పరంగా తప్పటడుగుల వేయడంతో భారత్‌కు తిప్పలు తప్పలేదు. ఇప్పటికైనా మోడీ దీని పరిష్కారాన్ని చేతల్లోకి తీసుకోవ డం ద్వారా శాశ్వత పరిష్కారానికి తెగువ చూపారు. దీనికి సుప్రీం ధర్మాసనం కూడా మద్దతు తెలిపింది.

# అడవిదొంగలపై ఆలస్యంగా చర్యలు

## ఇప్పటికే నష్టపోయిన సంపద ఎంతో?

ఆదిలాబాద్,డిసెంబర్11:అడవుల జిల్లా ఆదిలాబాద్‌ను అందిన కాడికి దోచుకున్నారు. అడవులను పూర్తిగా ధ్వంసం చేశారు. వన్యప్రాణులను ఇష్టం వచ్చినట్లుగా వేటాడారు. ఆదిలాబాద్ జిల్లా అంటే దట్టమైన దండకారణ్యంతో ఒకప్పుడు అడవుల జిల్లాగా పేరు ఉండేది. ఆకాశాన్ని ముద్దాడే టేకు వృక్షాలతో కనుచూపు మేర పచ్చని చెట్లతో, పక్షుల కిలకిలరావాల, చెంగుచెంగున ఎగిరే జింకలతో అహ్లాదకరంగా ఉండేది. స్మగ్లర్ల, వేటగాళ్ల ధన దాహానికి అటవీశాఖ అధికారుల అవినీతి, అక్రమాలు తోడవడం తో అడవి తల్లి నేలకొరగగా, వన్యప్రాణులు అంతరించిపోయే దుర్భర పరిస్థితి దాపురించింది. కవ్వాల్ అభయారణ్యంతోపాటు జిల్లాలోని ఇతర అటవీ ప్రాంతాల నుంచి టేకుతోపాటు ఇసుక, రాయి, మొరం అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయం అంతా కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు తెలిసినప్పటికీ మామూళ్లు తీసుకుని మౌనంగా ఉంటున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. అటవీశాఖ చెక్‌పోస్టుల్లోని సిబ్బంది అడవుల నుంచి అక్రమ కలప, ఇసుక, రాయి, వన్యప్రాణుల మాంసాన్ని తరలించకుండా చర్యలు తీసుకోవాల్సి ఉండగా వాటిని ఆ వాహనాల నుంచి డబ్బులు తీసుకు ని వదిలిపెట్టడంతోపాటు– ఇతర వాహనాల నుంచి కూడా ఎంతో కొంత ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రిజర్వు ఫారెస్టులో చెరువుల నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ పెంబి రిజర్వు ఫారెస్టులో చెరువులను నిర్మించారు. జిల్లా విస్తీర్ణంలో ఒకప్పుడు 40 శాతం ఉన్న అడవి ఇప్పుడు చాల తక్కువ శాతంలో ఉంది. జిల్లా నుంచి ప్రతి రోజు లక్షలాది రూపాయల విలువ చేసే టేకు కలప కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ అక్రమంగా తరలిపోతుంది. ఆదిలాబాద్ టేకు కలపకు ఇ తర ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉండడంతో స్మగ్లర్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. కోట్లాది రూపాయల కలప అ క్రమంగా తరలిపోతుంటే లక్షలాది రూ పాయల అక్రమ కలపను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నా రు. జింక, దుప్పులు, అడవి పంది తదితర వన్యప్రాణులను వేటగాళ్లు హతమార్చి మాంసాన్ని కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. జిల్లాలో కలప స్మగ్లర్లు, వన్యప్రాణుల వేటగాళ్లు ఎవరూ, వారు ఎక్కడికి సరఫరా చేస్తున్నారనే విషయాలు అటవీశాఖ అధికారులకు తెలిసినప్పటికీ వారు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి పట్టించుకోడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటవీ ప్రాంతంలోని 2 వందల ఎకరాల్లోని కోట్లాది రూపాయల విలువ చేసే టేకు వృక్షాలను గిరిజనులు పోడు వ్యవసాయం పేరిట నరికివేశారు.వందలాది ఎకరాల్లోని వేలాది టేకు వృక్షాలను నరికి అక్రమంగా కలపను ఇతర ప్రాంతాలకు ఇప్పటికే తరలించుకు పోయారు. అటవీ సంపద నాశనం కావడానికి కారకులైన ఆ శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అడవిని, కవ్వాల్ అభయారణ్యం నుంచి చిన్న కర్ర కూడా బయటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడ్డా కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు.

# రక్తనిధి నిల్వలో నిర్లక్ష్యం తగదు

– ప్రోత్సాహంతో పాటు కేంద్రాలను పెంచాలి

విజయవాడ,డిసెంబర్11:సురక్షితమైన రక్తం అందుబాటులో ఉండేలా చూడడానికి, జిల్లాకొక ప్రభుత్వ రక్త నిధి కేంద్రం స్థాయి పెంచడం ద్వారా నాణ్యమైన సేవలందించాలని సిఫార్సు చేసినా ఫలితం లేకుండా పోతోంది. ఇప్పటి వరకు జిల్లాలో అలాంటి రక్త నిధుల ఏర్పాటు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రక్తం సేకరించిన తేదీ, దాతపేరు, చిరునామా, వయస్సు, బరువు, హిమోగ్లోబిన్(హెచ్‌బీ) శాతం, రక్తం గ్రూపు మొదలైన అంశాలను సూచిస్తూ రక్తదాతల రిజిస్టర్‌ను రక్త నిధి కేంద్రాలు నిర్వహించాలి. ఆరోగ్యంగా ఉండి రక్తదానానికి ఒప్పుకున్న దాత నుంచి మాత్రమే రక్తం సేకరించినట్టు సంచులపై సూచికలు అతికించాలి. అంతేకాక నిర్ణీత ప్రమాణాలు లేని రక్త నిల్వలను నాశనం చేసేందుకు, రక్తమార్పిడి ద్వారా అంటురోగాలు ప్రబలకుండా చూసేందుకు ఇది దోహద పడుతుంది.

దీనివల్ల రోగులకు అనుకూలంకాని రక్తం ఇచ్చే ప్రమాదం ఉండదు. జిల్లాలోని రక్త నిధి కేంద్రాలను కలుపుకుని రక్త నిధులన్నింటిలోనూ సేకరించిన రక్తపు యూనిట్లు–, నిర్ణీత గడువులోగా ఉపయోగించకపోవడం వల్ల పడేయాల్సి వస్తోందని ఆడిట్ అధ్యయనంలో తేలింది. రక్తానికి బదులు కచ్చితం గా అవసరమైన భాగాలను మాత్రమే ఉపయోగించడం వల్ల రక్తాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవడం అవసరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది.

# భవిష్యత్ ప్రణాళికతో ముందుకు సాగాలి

తిరుమల,డిసెంబర్11:భవిష్యత్తు గురించి ముందుగా ప్రణాళికలు వేసుకుని పనిచేసే సామర్థ్యం చాలామందికి ఉండదు. అలా చేయడం వల్ల సమయంతో పాటు సామర్థ్యం కూడా పెరుగుతుంది. ఎందుకంటే మనం వర్తమా నానికి బందీలం. పక్కనేఉన్న ప్రమాదా లను, సంతోషాలను అధిగమించి పనిచె య్యడం ఒక గొప్ప శక్తి. వెనక్కి తగ్గే స్వభావాన్ని విడిచిపెట్టాలి. కళ్లకు కనిపించే దానికన్నా భవిష్యత్తులో గొప్పవి జరగబో తున్నాయని ఊహించడం నేర్చుకోవాలి. సాధారణంగా మనం తప్పులు చెయ్యడానికి కారణం– మన దగ్గరగా ఉన్న ప్రమాదాలకు భయపడటం, దూరంగాఉన్న ప్రమాదాలను పట్టించుకోకపోవడం! వాటినిగాని మనం ముందుగా ఊహించి అంచనా వెయ్యగలిగితే చాలా పొరపాట్లు నివారించవచ్చు.ఒకవేళ అనుకోని ప్రమాదం ఏదైనా ఎదురైతే, దాన్ని తెలివిగా మనకు అనుకూలంగా మార్చుకో వాలి. ఆంజనేయుడి తోకకు రావణాసురుడు నిప్పుపెట్టాడు. లంకలో రాక్షసులంతా తెగ ఆనందపడిపోయారు, హనుమంతుడు కాలి బూడిదైపోతాడని. అలా జరగలేదు. లంకనే తన తోకతో తగలబెట్టాడు హనుమంతుడు. ప్రమాదాన్ని తనకు అవకాశంగా ఉపయో గించుకుని చరిత్రలో ఒక గొప్ప రసవత్తరమైన ఘట్టంగా మలిచాడు ఆయన.పనులు ప్రారంభించేటప్పుడు వ్యవహారం నడిపేది మనం. వాటిని ఒక పద్ధతిలో నడిపించేది మనమే. ఒకసారి అవి ప్రారంభమయ్యాక, చాలాసార్లు అవే మనకు దారి చూపిస్తాయి.

# అధికారుల ఉదాసీనతతో ..ఇష్టారాజ్యంగా బోర్ల తవ్వకాలు

## – భూగర్భజలాలకు ప్రమాదం

నిజామాబాద్,డిసెంబర్11):అధికారుల్లో నెలకొన్న ఉదాసీనత వైఖరిని కొందరు అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా వాల్టాచట్టం క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. బోరుబావుల తవ్వకం, చెట్లనరికివేత, నదులు, వాగుల నుంచి ఇసుకతీత, తాగునీటి వనరుల కలుషితం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్టపడక పోగా, వాల్టా చట్టంలోని నియమనిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. వర్షాభావంతో చాలాచోట్ల ఇష్టం వచ్చినట్లుగా బోర్ల తవ్వకం చేపడుతున్నారు. బోరుబావుల రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం ప్రతిబావి యజమానీ 10 రూపాయలను రెవెన్యూ కార్యాయలంలో చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. బోరు తవ్వకం సమంలో సమీపంలోని మరోబోరు, బావికి కనీసం 200 మీటర్ల దూరం పాటించాలి. కొత్తగా బోరుబావి వేసుకునే రైతు అధికారులకు సమాచారం ఇవ్వడం ద్వారా శాస్త్రీయపద్ధతులను అనుసరించి జియాలాజికల్ అధికారులు సర్వే నిర్వహిస్తారు. అధికారులు సూచించిన ప్రదేశంలో బోరుబావి పడకుంటే రూ.10వేల వరకు బాధిత రైతుకు బీమా సౌకర్యం లభిస్తుంది. అయితే రైతుల్లో నెలకొన్న అవగాహన లోపంతో తమ ఇష్టానుసారంగా బోరుబావులు తవ్వించి ఆర్థికంగా నష్టపోతున్నారు. రిగ్గుల రిజిస్ట్రేషన్ బోరుబావులు తవ్వే రిగ్గుల యజమాని రూ.10వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ లేకుండా బోరుబావులను తవ్వుతున్న రిగ్గులను అధికారులు సీజ్‌చేయాల్సి ఉంటుంది. అలాంటి చర్యలేవీ లేకపోవడంతో రిగ్గుల యాజమాన్యాలు తమకు నచ్చిన ప్రదేశంలో బోరుబావి తవ్వకాలు చేపట్టి రైతుల నుంచి వేలాది రూపాయాలు వసూలు చేస్తున్నారు. పర్యావరణం, భూగర్భజలాలు, సహజవృక్షసంపద పరిరక్షణ కోసం వాల్టా చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. అమలులో పారదర్శకత కొరవడి ఉల్లంఘున చర్యలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారుల మధ్య అవగాహన లోపంతో చట్టం ఉల్లంఘనదారులపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వెలువడుతున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టి లో ఉంచుకొని ప్రభుత్వం కొన్ని నిమయనిబంధనలు అందులో పొందుపరిచారు. మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీ–, గ్రామపంచాయతీల పరిధిలో చెట్లను పరిరక్షించి వాతావారణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు రెవెన్యూ, అటవీ శాఖ, గ్రామపంచాయతీ అధికారులు కృషి చేయాలి. ఎవరైనా చెట్ల యజమానిచెట్లను తన అవసరాల కోసం పడ గొట్టాలనుకుంటే అధికారుల నుంచి అనుమతిపొందాలి. చెట్లను నరికివేసిన 30 రోజుల వ్యవధిలో సమీప ప్రదేశంలో రెండు మొక్కలు నాటాల్సి ఉంటుంది. సంబంధిత అధికారులకు అప్పగించిన బాధ్యతలను క్షేత్రస్థాయిలో అమలు చేయకపోవడంతో గ్రామాల్లోని సహజ అటవీ వృక్ష సంపద తగ్గుతున్నది. బొగ్గుబట్టీల వ్యాపారులు గ్రామశివారు భూముల్లోని చెట్లను నరికించి కాల్చడంతో తయారైన బొగ్గొను ఇతరప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా సమీపగ్రామాల్లో వాతావరణ కాలుష్యం పెరుగుతున్నది. నీటి కలుషితంపై నియంత్రణ భూగర్భజలాలు కలుషితం కాకుండా నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి.

# నిరుద్యోగులకు తీపి కబురు..

## రెండు రోజుల్లో సీఎం రేవంత్ సమీక్ష






హైదరాబాద్: తెలంగాణ నిరుద్యోగులకు తీపి కబురు. ఉద్యోగాల భర్తీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆయన రెండు రోజుల్లో ఉద్యోగాల భర్తీపై సమీక్ష నిర్వహించనున్నారు.ఖాళీల భర్తీకి సంబంధించిన పూర్తి వివరాలను తీసుకోని రివ్యూ మీటింగ్‌కు హాజరుకావాలని టీఎ?స్‌పీఎస్సీ ఛైర్మన్ బి.జనార్దన్ రెడ్డిని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశించింది .తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నుంచి.. అంటే 2014 నుంచి టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేసిన ఉద్యోగాలు, నోటిఫికేషన్‌లకు సంబంధించిన పూర్తి వివరాలతో సమీక్షకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. గత ఏడాదిన్నరగా.. టీఎస్‌పీఎస్సీలో పేపర్ల లీక్‌లు, ఆపై పరీక్షల వాయిదాల వ్యవహారంతో ప్రతిష్టంభన కొనసాగు తున్న విషయం తెలిసిందే.




## మరింత తగ్గిన బంగారం, వెండి - నేటి కొత్త ధరలు ఇవే..

భారతదేశంలో గత కొన్ని రోజులుగా పడుతూ.. లేస్తూ ఉన్న బంగారం, వెండి ధరలు ఈ నేడు కూడా స్వల్ప దగ్గుదల వైపు కదిలాయి. ప్రస్తుతం గోల్డ్ అండ్ సిల్వర్ ధరలు తెలుగు రాష్ట్రాల్లో ఎలా ఉన్నాయి, చెన్నై, ఢిల్లీలలో ఎలా ఉన్నాయనే మరిన్ని వివరాలు ఈ కథనంలో పరిశీలిద్దాం.



హైదరాబాద్, విజయవాడలో ఈ రోజు ఒక గ్రామ్ 22 క్యారెట్ల బంగారం ధర రూ. 5695, కాగా 24 క్యారెట్స్ గోల్డ్ ధర రూ. 6213గా ఉంది. ఈ లెక్కన 10 గ్రాముల 22 క్యారెట్స్ పసిడి ధర రూ. 56950, 24 క్యారెట్స్ గోల్డ్ రేటు రూ. 62130గా ఉంది. నిన్న స్థిరంగా ఉన్న పసిడి ధరలు ఈ రోజు ఒక్కసారిగా.. రూ. 200 నుంచి రూ. 220 వరకు తగ్గింది. ఇదే ధరలు గుంటూరు, ప్రొద్దుటూరు, ముంబై, బెంగళూరు మొదలైన ప్రాంతాల్లో కూడా ఉంటాయి.

# రూ. 20 వేల హెడ్‌ఫోన్స్ ఆర్డర్ చేశాడు..

### బాక్స్ తెరిచి చూడగా, షాక్..




ప్రస్తుతం ఆన్‌లైన్ షాపింగ్ భారీగా పెరిగింది. పెద్ద పెద్ద ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ నుంచి చిన్న చిన్న వస్తువుల వరకు ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేసే రోజులు వచ్చాయి. అయితే ఆన్‌లైన్ షాపింగ్ ఎలా విస్తరిస్తుందో, మోసాలు సైతం అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఒక వస్తువు ఆర్డర్ చేస్తే దానికి బదులు మరో వస్తువులు రావడం ఇటీవల బాగా పెరుగుతోంది. ఇలాంటి మోసాలు ఎక్కువవుతాన్నాయి. తాజాగా ఇలాంటి ఓ మోసానికి సంబంధించిన వీడియో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే.. ఆన్‌లైన్‌లో ఫోన్‌లు ఆర్డర్ చేస్తే సబ్బులు రావడం, రాళ్లు రావడం లాంటి ఘటనలు చూశే ఉంటాం. అయితే తాజాగా ఓ వ్యక్తి హెడ్‌ఫోన్స్‌ను ఆర్డర్ చేయగా వచ్చిన వస్తువును చూసి ఒక్కసారిగా షాక్‌కి గురయ్యాడు. ఇంతకీ ఆ బాక్సులో ఏముందనేగా.. ఓజాహ్ అనే వ్యక్తి దీనికి సంబంధించి ఓ వీడియోను ట్వీట్ చేశాడు. సోనీ ఎక్స్‌బీ910ఎన్ హడ్‌ఫోన్‌లను అమెజాన్‌లో ఆర్డర్ చేశాడు. ఈ హెడ్ ఫోన్ ధర రూ. 19,900గా ఉంది. అమెజాన్ నుంచి వచ్చిన ఆర్డర్ బాక్స్‌ను ఓపెన్ చేసే సమయంలో వీడియోను రికార్డ్ చేశాడు. హెడ్‌ఫోన్‌కు సంబంధించిన అన్‌బాక్స్ వీడియోను చిత్రీకరించేందుకు ఓజాహ్ ఈ వీడియోను రూపొందించాడు.

అయితే బాక్స్ ఓపెన్ చేసి చూడానే అందులో హెడ్ ఫోన్స్‌కు బదులు కోల్‌గేట్ టూత్ పేస్ట్ కనిపించింది. దీంతో ఒక్కసారిగా షాక్‌కి గురైన ఓజాహ్ ఆ వీడియోను ట్విట్టర్‌లో షేర్ చేశాడు.. ఈ వీడియోతో పాటు 'సోనీ %శదీ910చీ% వైర్‌లెస్ హెడ్‌ఫోన్‌లను అమెజాన్ ద్వారా రూ. 19,900కి ఆర్డర్ చేశాను.

# భారత్‌లో ఎక్కువ జీతం తీసుకుంటున్న సీఈఓ ఎవరో తెలుసా?



భారత్‌లో అత్యధిక వేతనం తీసుకుంటున్న సిఈఓల జాబితాలో ఫ్రాన్స్‌కు చెందిన థియరీ డెలాపోర్టే అగ్రస్థానంలో నిలిచారు.

2020 నుంచి విప్రో సీఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న డెలాపోర్టే ..

వేతనాల విషయంలో దేశీయ మిగిలిన టెక్ కంపెనీలు హెచ్‌సీఎల్, టీసీఎస్ సీఈఓలను వెనక్కి నెట్టారు. ఏడాదికి రూ.82 కోట్ల వేతనాన్ని పొందుతున్నారు. ఈ సందర్భంగా ఫోర్బ్స్‌తో డెలాపోర్టే మాట్లాడుతూ.. " విప్రో సీఈఓ పదవికి అర్హులైన వారి కోసం అన్వేషిస్తున్న సమయంలో ఆ సంస్థ ఛైర్మన్ అజీమ్ ప్రేమ్‌జీని, ప్రస్తుత ఛైర్మన్ అజీమ్ కుమారుడు రిషద్ ప్రేమ్‌జీని కలిశాను. వారితో మాట్లాడక ముందు భవిష్యత్‌పై నాకు అనేక ప్రతికూల ఆలోచనలు ఉన్నాయి.

కానీ అజీమ్, రిషద్‌తో మూడు, నాలుగు గంటలు గడిపిన తర్వాత నా ఆలోచన ధోరణి పూర్తిగా మారింది. వారి ఇద్దరి మాటల్లో విలువలతో కూడిన ఆశయాలు, ప్రాధాన్యతల గురించి విన్న తర్వాత ఏమాత్రం ఆలస్యం చేయకుండా సీఈఓగా పదవీ బాధ్యతలు చేపట్టేందుకు




అంగీకరించాను" అని డెలాపోర్టె అన్నారు.

డెలాపోర్టే తర్వాత ఎవరంటే?
ఇక డెలాపోర్టే తర్వాత ఇన్ఫోసిస్‌కు చెందిన సలీల్ పరేఖ్



దేశంలోనే అత్యధిక చెల్లింపులు జరుపుతున్న రెండవ సీఈఓగా అవతరించారు. ఎకనామిక్ టైమ్స్ నివేదికలో స్టాక్ మార్కెట్‌లోని బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ 500 కంపెనీల విశ్లేషణలో తేలింది. పరేఖ్ ఈ ఏడాది రూ. 56.45 కోట్ల జీతం తీసుకున్నారు. రూ. 30 కోట్ల వేతనంతో టెక్ మహింద్రా సిఈవో సిపి గుర్నాని మూడో స్థానంలో నిలిచారు. నాల్గవ స్థానంలో మాజీ టీసీఎస్ సీఈఓ రాజేష్ గోపీనాథన్ రూ. 29 కోట్లకు పైగా సంపాదించారు

రేసులో కామత్ సోదరులు
ఈ ఏడాదిలో అత్యధిక వేతనం పొందుతున్న స్టార్టప్ డైరక్టర్, సీఈఓగా జీరోధా సోదరులు నిలిచారు. జీరోధార ఫౌండర్ నితిన్ కామ్, నిఖిల్ కామత్‌లు ఇద్దరూ అత్యధిక వేతనం పొందుతున్న స్టార్టప్ సీఈఓలుగా ప్రసిద్ధి చెందారు. వారిద్దరి వేతనం ఏడాది రూ.72కోట్లుగా ఉంది.






# మాకొద్దు మీ కాంట్రాక్టులు..

### విండీస్ బోర్డుకు షాకిచ్చిన ముగ్గురు స్టార్ క్రికెటర్లు

వెస్టిండీస్ స్టార్ క్రికెటర్లు నికోలస్ పూరన్, జేసన్ హెూల్డర్, కైల్ మేయర్స్‌లు కీలక నిర్ణయం తీసుకున్నారు. తమకు వెస్టిండీస్ క్రికెట్ బోర్డు అందజేసే కాంట్రాక్టులు అవసరం లేదని తేల్చి చెప్పారు. కాంట్రాక్టులను తిరస్కరించిన పూరన్, హెూల్డర్, మేయర్‌లు వచ్చే ఏడాది అమెరికాతో పాటు స్వదేశంలో జరగాల్సి ఉన్న టీ20 వరల్డ్ కప్‌కు మాత్రం అందుబాటులో ఉంటామని బోర్డుకు తెలియజేశారు. ఫ్రాంచైజీ క్రికెట్‌లో ఆడే ఈ స్టార్ ప్లేయర్లు.. దేశానికంటే లీగ్ క్రికెట్‌కే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు.
డిసెంబర్ 10న క్రికెట్ వెస్టిండీస్ సెంట్రల్ కాంట్రాక్టులను ప్రకటించింది. పురుషుల క్రికెట్‌లో 14 మంది, మహిళల క్రికెట్లో 15 మందికి కాంట్రాక్టులను అందజేసింది. పురుషుల క్రికెట్‌లో గుడకేశ్ మోటీ, కీసీ కార్టీ, తేజ్‌నారాయణ్ చందర్‌పాల్, అలిక్ అథనాజ్‌లు కొత్తగా కాంట్రాక్టులను దక్కించుకోగా మహిళల జాబితాలో జైదా జేమ్స్, గ్రిమ్మండ్‌లకూ అవకాశం దక్కింది.

## ఢిల్లీ అభిమానులకు గుడ్‌న్యూస్

ఐపీఎల్ 2024 వేలానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ అభిమానులకు శుభవార్త అందింది. తమ స్టార్ ఆటగాడు రిషబ్ పంత్ తదుపరి సీజన్ నుంచి జట్టుకు అందుబాటులో ఉంటాడని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది.

గతేడాది కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పంత్.. 2024 సీజన్‌లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా సేవలందిస్తాడని పలు వార్తా సంస్థలు పేర్కొన్నాయి.



గాయం నుంచి పూర్తిగా కోలుకోని కారణంగానే పంత్ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండలేదని తెలుస్తుంది. పంత్ రీఎంట్రీపై ఢిల్లీ యాజమాన్యం ఎలాంటి అధికారక ప్రకటన చేయనప్పటికీ.. ఈ వార్త నెట్టింట హల్‌చల్ చేస్తుంది. పంత్.. ధోని, పార్థివ్ పటేల్, జహీర్ ఖాన్ తదితరులతో కలిసి ఓ నైట్ పార్టీకి అటెండ్ అయిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరలవుతుండగానే ఐపీఎల్ రీఎంట్రీపై వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

పంత్ ఫ్యాన్స్ ఈ వార్త విని సంబురాల్లో మునిగి తేలుతున్నారు. పంత్ గైర్హాజరీలో గత సీజన్‌లో డేవిడ్ వార్నర్ ఢిల్లీ కెప్టెన్‌గా వ్యవహరించిన విషయం తెలిసిందే. గత సీజన్‌ను చివరి నుంచి రెండో స్థానంతో ముగించిన ఢిల్లీ.. క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించకుండానే లీగ్ నుంచి నిష్క్రమించింది. పంత్ తిరిగి జట్టులో చేరితే పూర్తి స్థాయి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. 26 ఏళ్ల పంత్ ఐపీఎల్‌లో 98 మ్యాచ్‌లు ఆడి సెంచరీ, 15 హాఫ్ సెంచరీల సాయంతో 2838 పరుగులు చేశాడు. అతని ఖాతాలో 64 క్యాచ్‌లు, ఆరు రనౌట్లు, 18 స్టంపింగ్‌లు (ఐపీఎల్) ఉన్నాయి.

## టీమిండియాతో టెస్ట్ సిరీస్.. ఇంగ్లండ్ జట్టు ప్రకటన

వచ్చే ఏడాది (2024) జనవరి 25 నుంచి మార్చి 11 వరకు భారత్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోస?ం 16 మంది సభ్యుల జట్టును ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఇవాళ (డిసెంబర్ 11) ప్రకటించింది.

ఈ జట్టుకు సారధిగా బెన్ స్టోక్స్‌ను ఎంపిక చేసిన ఈసీబీ.. ముగ్గురు అన్‌క్యాప్డ్ ప్లేయర్లకు (గస్ అట్కిన్సన్ (పేస్ బౌలర్), టామ్ హార్ట్లీ (ఆఫ్ స్పిన్నర్), షోయబ్ బషీర్ (ఆఫ్ స్పిన్నర్)) అవకాశం కల్పించింది.

గాయం కారణంగా గత కొంతకాలంగా జట్టుకు దూరంగా ఉన్న జాక్ లీచ్ భారత్‌తో సిరీస్‌తో టెస్ట్ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇవ్వనున్నాడు. ఈ సిరీస్ కోసం భారత జట్టును ప్రకటించాల్సి ఉంది.

భారత్‌తో సిరీస్‌కు ఇంగ్లండ్ జట్టు:
బెన్ స్టోక్స్ (కెప్టెన్), రెహాన్ అహ్మద్, జేమ్స్ ఆండర్సన్, గస్ అట్కిన్సన్, జానీ బెయిర్‌స్టో, షోయబ్ బషీర్, హ్యారీ బ్రూక్, జాక్ క్రాలే, బెన్ డకెట్, బెన్ ఫోక్స్, టామ్ హార్ట్లీ, జాక్ లీచ్, ఒల్లీ పోప్, ఓలీ రాబిన్సన్, జో రూట్, మార్క్ వుడ్




షెడ్యూల్..లతొలి టెస్ట్: జనవరి 25-29 (హైదరాబాద్)
రెండో టెస్ట్: ఫిబ్రవరి 2-6 (వైజాగ్)
మూడో టెస్ట్: ఫిబ్రవరి 15-19 (రాజ్‌కోట్)
నాలుగో టెస్ట్: ఫిబ్రవరి 23-27 (రాంచీ)
ఐదో టెస్ట్: మార్చి 7-11 (ధర్మశాల)

# డెవిల్ ఫస్ట్ లుక్ విడుదల

నందమూరి కల్యాణ్‌రామ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డెవిల్. ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్ అనేది ఉపశీర్షిక. ఈ చిత్రానికి అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తుండగా.. స్పై థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కుతుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి లాంఛ్ చేసిన కల్యాణ్‌రామ్, మాళవిక నాయర్, ఎల్నాజ్ నొరౌజీ ఫస్ట్ లుక్ పోస్టర్‌లతో పాటు డెవిల్ టీజర్.. నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే ఈ మూవీ నుంచి కొన్నాళ్లుగా ఎలాంటి అప్‌డేట్స్ రాలేదు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కొత్త న్యూస్ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం నయా అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ మూవీ ట్రైలర్‌కు సంబంధించి మేకర్స్ సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ ట్రైలర్‌ను డిసెంబర్ 12న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా తెలిపింది. ఇక ఈ సినిమాను డిసెంబర్ 29న పాన్ ఇండియా లెవల్లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. దేశ ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా డెవిల్ ముసుగేసుకుని బ్రిటీషర్ల కోసం కళ్యాణ్‌రామ్ ఎందుకు పని చేశాడనే కాన్సెప్ట్‌తో పీరియాడిక్ స్పై థ్రిల్లర్‌గా ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు తెలుస్తుంది. లుక్స్ పరంగా కళ్యాణ్ రామ్ కూడా ఈ సినిమాలో చాలా బాగున్నాడు. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై అభిషేక్ నామా ఈ సినిమాను నిర్మిస్తున్నాడు.




## హాయ్ నాన్న మనసుకు హత్తుకునేలా ఉంది

### నానికి అభినందనలు తెలిపిన పుష్ప



నాని హీరోగా నటించిన 'హాయ్ నాన్న' చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసల వర్షం కురిపించారు. మధురమైన చిత్రమని, మనసుకు హత్తుకుందని ఆయన కొనియాడారు. నాని, మృణాల్ ఠాకూర్ జంటగా శౌర్యువ్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రాన్ని ఆయన వీక్షించారు. ఈ మేరకు చిత్ర బృందాన్ని ప్రశంసిస్తూ సినిమాకు రివ్యూ ఇచ్చారు. 'సోదరుడు నాని నటన అద్భుతం. ఆక్షణీయమైన స్క్రిప్టు వెలుగులోకి తెచ్చినందుకు టీమ్ మీద మరింత రెస్పెక్ట్ పెరిగింది. మృణాల్ నటన మనసుకు హత్తుకుంది. ఆ పాత్ర ఆమెకు లాగే బ్యూటిఫుల్‌గా ఉంది. మై డార్లింగ బేబీ కియారా.. నీ క్యూట్‌నెస్‌తో మనసుల్ని కరిగించేశావు. ఇక చాలు స్కూల్‌కి వెళ్లిపో. మిగిలిన ఆర్టిస్ట్‌లు కూడా ఎక్కడా పేరు పెట్టడానికి లేకుండా తమ ప్రతిభను చూపించారు. సాంకేతిక నిపుణుల అద్భుతమైన పని తెరపై కనిపిస్తోంది. ముఖ్యంగా కెమెరామెన సాను జాన వర్గీస్, సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వాహబ్ గొప్ప టెక్నీషియన్స అని నిరూపించుకున్నారు. ఇక దర్శకుడు శౌర్యువ్ తొలి చిత్రంతోనే అందరినీ ఆకట్టుకున్నారు. ఎన్నో హృదయాలను హత్తుకునేలా, కంట తడి పెట్టేలా సన్నివేశాలను క్రియేట్ చేశారు. సీన్స్ ప్రజంటేషన్ చాలా బావుంది. ప్రతి సన్నివేశాన్ని చాలా మెచూర్డ్‌గా చిత్రీకరించారు, అద్భుతమైన స్క్రిప్టు ఎంకరేజ్ ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన నిర్మాతలకు అభినందనలు. 'హాయ్ నాన్న' చిత్రం తండ్రులనే కాకుండా ప్రతి కుటుంబ సభ్యుడి హృదయాన్ని హత్తుకుంటుంది' అని అల్లు అర్జున్ ట్వీట్‌లో పేర్కొన్నారు. బన్నీ చేసిన ట్వీట్‌కు నాని స్పందించారు. 'అర్హా తండ్రి ఆమోదించారు. మంచి సినిమా కోసం మీరు ఎప్పుడూ నిలబడతారు. థ్యాంక్యూ సో మచ్ బన్నీ' అని ట్వీట్‌కు రిప్లై ఇచ్చారు నాని.

## తుది దశకు గుంటూరు కారం షూటింగ్



మహేష్ బాబు, శ్రీలీల జంటగా నటిస్తున్న 'గుంటూరు కారం' సినిమా తుది దశకు చేరుకుంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఈనెల 25లోపు మొత్తం పూర్తవుతుందని యూనిట్ సభ్యుల టాక్. కేరళకి వెళ్లి తీయాల్సిన పాటని హైదరాబాదులో తీసేసారు అని తెలిసింది. కేరళలో వరదలు, లైటింగ్ కూడా అనుకున్నవిధంగా లేకపోవటంతో ఆ పాటని హైదరాబాదులో పూర్తి చేసినట్టుగా తెలుస్తోంది. ఇది మాంటేజ్ పాట అని, ఇది ఇక్కడ హైదరాబాదులో పూర్తి చేసారని తెలిసింది. ఇక మిగతా పాటలని కూడా హైదరాబాదులోనే తీయనున్నట్టుగా కూడా తెలిసింది. ఒకటి శ్రీలీల, మహేష్ బాబు ల మీద ఉంటుందని, ఈ పాట కోసం ఒక ప్రత్యేక సెట్ కూడా తయారయిందని తెలిసింది. ఈ సినిమాలో మహేష్ బాబు పాత్ర పేరు రమణ అని కూడా ఒక చిన్న లీక్ బయటకి వచ్చింది. అలాగే ఇంకో మాస్ పాట కూడా ఉండబోతోందని, ఇది కూడా హైదరాబాదులో తీస్తారు అని తెలిసింది. ఇక మహేష్ బాబు, ప్రకాష్ రాజ్ మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాలో హైలైట్ గా వుంటాయని అంటున్నారు. వాళ్ళిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలన్నీ చాలా ఇంటెన్సిటీ తో వుంటాయని తెలుస్తోంది. మహేష్ బాబు ఈ సినిమాకి డబ్బింగ్ కూడా మొదలుపెట్టేశారు అని కూడా తెలుస్తోంది. అన్నీ ఈ నెల 25లోగా పూర్తి చేసెయ్యాలన్న దృఢ సంకల్పంతో మొత్తం యూనిట్ వున్నారని తెలుస్తోంది. జనవరి 5 నుండి ప్రచారాలు కూడా మొదలుపెడతారని తెలుస్తోంది. ఈ సినిమా హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తోంది.

## పిండం సినిమాకు ఎ సర్టిఫికెట్

ఒకరికి ఒకరు ఫేమ్ శ్రీరామ్ నటిస్తున్న తాజా చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉప శీర్షిక. కుశీ రవి హీరోయిన్‌గా నటిస్తుండగా.. సాయికిరణ్ దైదా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇక సాయికిరణ్‌కు ఇదే మొదటి మూవీ. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్, ట్రైలర్‌లు విడుదల చేయగా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమా సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ మూవీకి 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చింది. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ.. ఈ సినిమాను గర్భిణీ స్త్రీలు చూడవద్దని సెన్సార్ బోర్డు హెచ్చరిక జారీచేసినట్లు తెలిపింది.



## మూడు నెలలలో 100 కోట్లు నష్టం

### చెత్త రికార్డు సొంతం చేసుకున్న శ్రీలీల

ఎలాంటి అంచనాలు లేకుండా సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి తెలుగు చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోయిన్గా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు పెళ్లి సందడి సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈమె ఈ సినిమా ద్వారా పెద్దగా కమర్షియల్ గా సక్సెస్ సాధించలేకపోయిన తన లుక్స్ నటన పరంగా మంచి సక్సెస్ అందుకున్నారు. ఇక ఈ సినిమా తర్వాత ధమాకా సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చినటువంటి ఈమె ఈ సినిమాతో బ్లాక్ బాస్టర్ హిట్ అందుకోవడంతో ఏకంగా 12 సినిమాలకు సంతకం చేశారు.ఇలా ప్రతి నెల ఈమె నటించిన సినిమాలు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. ఇప్పటికే నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాగా ఇందులో ఒక్క సినిమా మాత్రమే సూపర్ హిట్ అందుకొని నిర్మాతలకు లాభాలను తీసుకువచ్చింది మిగిలిన స్కంద, ఆది కేశవ, ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ ఈ సినిమాలు మూడు కూడా భారీ స్థాయిలో నిర్మాతలకు నష్టాలను తీసుకువచ్చాయని చెప్పాలి. ఇక ఈ సినిమాలకు కనీసం ఓపెనింగ్స్ కూడా రాకపోవడం విశేషం దీంతో నిర్మాతలు భారీగా నష్టపోయారు. ఇలా ఈ మూడు నెల వ్యవధిలోను మూడు సినిమాలు డిజాస్టర్ కావడంతో నిర్మాతలకు సుమారు 100 కోట్ల వరకు నష్టం ఉంటుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు ఏ హీరోయిన్ ఖాతాలో మూడు నెలలలోనే 100 కోట్లు నష్టం తెచ్చినటువంటి రికార్డు లేదని ఈ విధమైనటువంటి చెత్త రికార్డు సొంతం చేసుకున్నటువంటి ఏకైక హీరోయిన్ శ్రీ లీల అని తెలుస్తుంది అయితే ఈమె తదుపరి మహేష్ బాబ పవన్ కళ్యాణ్‌వంటి స్టార్ హీరోల సినిమాలలో నటిస్తున్నారు ఇక ఈమెకు మహేష్ బాబు మంచి సక్సెస్ కనుక అందించలేకపోతే ఈమె కెరియర్ పూర్తిగా ఇబ్బందులలో పడుతుందని తెలుస్తుంది. మహేష్ బాబు గుంటూరు కారంసినిమా పైనే శ్రీ లీల సినీ కెరియర్ ఆధారపడి ఉందని చెప్పాలి.



## నాసామి రంగా నుంచి పాట విడుదల

సంక్రాంతికి 'నా సామిరంగా' చిత్రంతో సందడి చేయబోతున్నారు నాగార్జున. విజయ్ బిన్నీ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆషికా రంగనాథ్ కథానాయిక. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. ఆదివారం 'నా సామిరంగ' నుంచి 'ఎత్తుకెళ్లిపోవాల దపిస్తుందే... రమణి ముద్దుల గుమ్మ నందనా' అంటూ సాగే తొలి గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. చంద్రబోస్ సాహిత్యానికి ఎంఎం కీరవాణి స్వరాలు సమకూర్చారు. రామ్ మిరియాల ఆలపించారు. ప్రసన్నకుమార్ బెజవాడ ఈ చిత్రానికి కథ, మాటలు అందిస్తున్నారు.




## ఈ వారం చిన్న చిత్రాల హవా

### - థియేటర్లలోకి వస్తున్న పలు సినిమాలు

ఈ ఏడాది చివరికి చేరుకుంది. నెలాఖరులో పెద్ద 'సలార్' 'డంకీ' లాంటి చిత్రాల హవా ఉండడంతో చిన్న చిత్రాలు అన్ని ఈ వారం విడుదలకు వరుస కట్టాయి. ఈ వారం థియేటర్స్‌లో ప్రేక్షకుల ముందుకు వస్తున్న సినిమాల్లో జోరుగా హుషారుగా... ఒకటి. విరాజ్ అశ్విన్ హీరోగా అను ప్రసాద్ తెరకెక్కిస్తున్న చిత్రం 'జోరుగా హుషారుగా'. అను ప్రసాద్ దర్శకత్వంలో నిరీష్ తిరువిధుల నిర్మించారు. పూజిత పొన్నాడ కథానాయిక. 'బేబీ'తో పాపులర్ అయిన విరాజ్ నటిస్తున్న చిత్రమిది. పోస్టర్స్, ట్రైలర్స్ మెప్పించేలా ఉన్నాయి. ఈ నెల 15న విడుదల కానున్న ఈ చిత్రం చక్కని విజయం అందుకుంటుందని నమ్మకం వ్యక్తం చేశారు. ఇకపోతే 'పిండం' చిత్రంతో ప్రేక్షకుల్ని భయపెట్టేందుకు సిద్ధమవుతున్నారు హీరో శ్రీరామ్. సాయికిరణ్ దైదా తెరకెక్కించిన ఈ చిత్రానకి యశ్వంత్ దగ్గుమాటి నిర్మాత. ఈ నెల 15న థియేటర్లలోకి వస్తోంది.. 'మరణం అనేది నిజంగానే అంతమా? మరణించిన తర్వాత ఏం జరుగుతుంది అనేది ఎవరైనా చెప్పగలరా? కోరికలు తీరని వారి ఆత్మలు ఈ భూమ్మీద నిలిచిపోతాయా? ఆ ఆత్మలు నిజంగానే మనకు హాని చేయగలవా? అన్న అంశాలతో సస్పెన్స థ్రిల్లర్‌గా ఈ చిత్రం రాబోతోంది. ఈశ్వరీరావు, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హారర్ 'కలశ'..భానుశ్రీ, సోనాక్షి వర్మ, అనురాగ్ కీలక పాత్రల్లో కొండా రాంబాబు తెరకెక్కించిన చిత్రం 'కలశ'. రాజేశ్వరి చంద్రజ వాడపల్లి నిర్మించారు. అన్ని డిసెంబరు 15న థియేటర్లలోకి రానుంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు అనూహ్య స్పందన వచ్చింది.







